

# సూర్య

www.suryaa.com

మహబూబ్‌నగర్
నాగర్‌కర్నూల్
జోగులాంబగద్వాల్
నారాయణపేట
వనపర్తి

బుధవారం 16 జులై 2025 | పేజీలు 8


## వనమహోత్సవం విజయవంతానికి
# సమగ్ర చర్యలు

**- నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవితో కలిసి మొక్కలు నాటిన ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్**





**నాగర్‌కర్నూల్, మేజర్‌న్యూస్:** నాగర్ కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని తాడూరు మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో తెలంగాణ వన మహోత్సవంలో భాగంగా మంగళవారం నాగర్ కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి, శాసనసభ్యులు డాక్టర్ రాజేష్ రెడ్డి లతో నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ కేజీబీవీ విద్యార్థినీలతో కలిసి మొక్కలు నాటారు. నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు, మాట్లాడుతూ పచ్చదనాన్ని పెంపొందిస్తూ, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆహ్లాదకర పర్యావరణం అందించాలనే బృహత్తర సంకల్పంతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి. మనమంతా ఒక్కొక్క మొక్క నాటి, మన ప్రకృతిని కాపాడే యజ్ఞంలో ముందడుగు వేయాలి. పచ్చని భూమి మన భవిష్యత్తు భరోసా ఈ మహత్తర కార్యక్రమంలో అందరూ చురుకుగా పాల్గొనాలని ఎంపీ డాక్టర్ మల్లు రవి, పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ వన మహోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించి, పచ్చదనాన్ని పెంపొందించేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని, ఈ సంవత్సరం జిల్లా వ్యాప్తంగా 41 లక్షల మొక్కలు నాటే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాం. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు నర్సరీల్లో అవసరమైన మొక్కలను ముందుగానే సిద్ధం చేయడం, అనువైన ప్రదేశాల్లో గుంతలు తవ్వడం, నాటే పనుల్లో అధికారులు మరియు సిబ్బందిని సన్నద్ధం చేయడం వంటి చర్యలు చేపట్టాం అని అన్నారు.గత ఏడాది వన మహోత్సవ అమలులో కనిపించిన లోటుపాట్లను గుర్తించామని,

మిగతా 2లో

## భవిత కేంద్రంలో పిల్లలకు అన్ని వసతులు కల్పించాలి

**- జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్**





**నారాయణపేట జిల్లా ప్రతినిధి మేజర్‌న్యూస్:** నారాయణపేట జిల్లా కేంద్రంలోని ఎంఈవో కార్యాలయం ఆవరణలో గల భవిత కేంద్రాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ కేంద్రంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలు మొత్తం ఎంతమంది ఉన్నారని, వారికి విద్యా బోధన ఎలా చేస్తున్నారని ఆమె అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు నాణ్యతతో కూడిన మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. విద్యా బోధన పరికరాలను, రిజిస్టర్లను కలెక్టర్ పరిశీలించారు. పిల్లలకు రవాణా ఛార్జీలు ఎలా చెల్లిస్తునారని ఆరా తీశారు. కేంద్రంలో వాష్ బేసిన్, మరుగు దొడ్లు లేకపోవండపై ఆమె తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. పక్కనే మరుగుదొడ్లు ఉన్నాయని, కానీ నీటి వసతి లేక నిరుపయోగంగా మారాయని ఎంఈవో బాలాజీ కలెక్టర్ కు తెలపడంతో స్పందించిన కలెక్టర్ ఒక్కరోజులో మరుగుదొడ్లకు నీటివసతి కల్పించి మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురావాలని మున్సిపాలిటీ కమిషనర్, ఎంపీడీఓను ఆదేశించారు. ఎమ్మార్సీ భవనాన్ని కూడా ఆమె పరిశీలించారు.

## రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

**- జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్**




**గద్వాల ప్రతినిధి మేజర్ న్యూస్:** ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉండి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ ఆదేశించారు. ధరూర్ మండలంలోని ఉప్పేరు గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం-ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆసుపత్రిలో ఆరోగ్య సిబ్బంది హాజరు రిజిస్టర్, ప్రసవాల రిజిస్టర్, స్టాక్ రిజిస్టర్, తదితర రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రతి రిజిస్టరులో సక్రమంగా పూర్తి వివరాలతో నమోదు చేయాలని సూచించారు. ఆసుపత్రికి ప్రతి రోజు రోగులు ఎంతమంది వస్తున్నారు, ఇన్ పేషంట్స్ వివరాలను వైద్య సిబ్బందితో అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది ఎల్లప్పుడూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉండాలని, విధుల్లో సమయపాలన కచ్చితంగా పాటించాల్సిందిగా ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో పూర్తి స్థాయి అవగాహన కల్పించి, గర్భిణుల నార్మల్ ప్రసవాలు నిర్వహించి, ,ప్రసవాల సంఖ్యను గణనీయంగా పెంచాలని ఆదేశించారు.ప్రతి గర్భిణి ప్రసవ తేదీకి అనుగుణంగా డెలివరీ క్యాలెండర్‌ను ఖచ్చితంగా రూపొందించి,అవసరమైన వైద్య సదుపాయాలు సమయానికి అందించాలని అన్నారు. అత్యవసర వైద్య సేవలు అందించేందుకు ఈ ప్రాంతానికి ఒక అంబులెన్స్‌ను త్వరితగతిన కేటాయిస్తామన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలన్నారు.ఫార్మసిస్టు మందుల నిల్వలను జాగ్రత్తగా పర్యవేక్షిస్తూ,ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూసుకోవాలని అన్నారు.టీకాలు ఖచ్చితంగా షెడ్యూల్ ప్రకారం సమయానికి వేయాలని సూచించారు.ఆరోగ్య సేవల నాణ్యతను మెరుగుపరచడం కోసం ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది పూర్తి బాధ్యతతో పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య అధికారి సిద్దప్ప, డాక్టర్లు రాజు,కృష్ణవేణి,వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సాధికారతకు
# రేవంత్ రెడ్డి సర్కార్ పెద్దపీట

- స్వయం సహాయ సంఘల మహిళలకు ఇకనుండి 10 లక్షల వడ్డీ లేని రుణం. భీమా మరియు ప్రమాద బీమా
- ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకున్న వారి గృహ ప్రవేశానికి చీర సారేతో వస్త్రా
- ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి
- మహిళా సంఘాలకు రూ : 38.కోట్ల 80 లక్షల రుణాలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే, కలెక్టర్





**వనపర్తి ప్రతినిధి మేజర్ న్యూస్ :** తెలంగాణ రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ప్రధాన లక్ష్యంగా వారికి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్నామని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. వనపర్తి జిల్లా కేంద్రంలోనీ అర్‌జి గార్డెన్‌లో మంగళవారం నిర్వహించిన ఇందిరా మహిళాశక్తి సంబరాలు కనివిని ఎరుగని రీతిలో జరిగాయి జిల్లా నలుమూలల నుంచి మహిళలు అశేషంగా తరలివచ్చారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లా డుతూ తెలంగాణ రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి లక్ష్యమని అన్నారు. రాష్ట్రంలో పేదలందరికీ సన్న బియ్యం ఇవ్వడం జరుగుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు ఎన్నో సంవత్సరాలుగా కొత్త రేషన్ కార్డుల కొరకు ఎదురుచూస్తున్న మహిళలకు ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసిందని ఎమ్మెల్యే తెలిపారు వనపర్తి జిల్లాలో 5350 కొత్త రేషన్ కార్డులు మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు ఇల్లు లేని నిరుపేదలకు సొంత ఇంటి కల నెరవేర్చడానికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసిందని ఇప్పుడు మంజూరైన వారందరూ ఇల్లుకట్టుకుంటే గృహప్రవేశానికి సారీ,

మిగతా 2లో

## సమగ్ర చర్యలు

(మొదటిపేజీ తరువాయి)



ఈసారి అవి పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నామని చెప్పారు. చనిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలను నాటే పనులు కూడా ఇప్పటికే కొనసాగుతున్నాయని కలెక్టర్ వెల్లడించారు. నాటిన ప్రతి మొక్క బ్రతికేలా, పకడ్బందీగా సంరక్షణ చర్యలు చేపడుతున్నాం. శాసనసభ్యులు డాక్టర్ కూచుకుళ్లరాజేష్ రెడ్డి, మాట్లాడుతూ మొక్కలు నాటాల్సిన ఆవశ్యకత గురించి ఎవరికి వారు గుర్తించి, విధిగా మొక్కలు నాటాలని సూచించారు. మొక్కల వల్ల పర్యావరణ సమతుల్యం కాపాడబడటంతో పాటు పచ్చదనం పెరిగి సకాలంలో వర్షాలు కురుస్తాయని, జీవ కోటికి స్వచ్ఛమైన ప్రాణ వాయువు లభిస్తుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దేవ సహాయం, జిల్లా అటవీ శాఖ అధికారి రోహిత్ గోపిడి, డీఈఓ రమేష్ కుమార్, కేజీబీవీల పర్యవేక్షణ అధికారిని శోభారాణి, కేజీబీవీ ప్రత్యేక అధికారిని విజయ, ఉపాధ్యాయులు విద్యార్థులు ఇతర ప్రజాప్రతినిధులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శేషంపల్లి గ్రామాన్ని సందర్శించిన ఎంఈఓ సురేష్



**మల్దకల్ మేజర్ న్యూస్ :** జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల పరిధిలోని శేషం పల్లి గ్రామంలో మంగళ వారం మండల విద్యాధికారి జి సురేష్ పర్యటించారు. ఆయన మాట్లాడుతూ బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని గ్రామ పెద్దలకు తెలిపారు. అదేవిధంగా ఇంటింటికి తిరిగి తల్లిదండ్రుల తో మాట్లాడి చదువు యొక్క ప్రాముఖ్యతను గురించి తల్లిదండ్రులకు వివరించారు. ప్రతి విద్యార్థుల్లో అద్భుత ప్రతిభ దాగి ఉంటుందని, ఉన్నత చదువుల ద్వారా జీవితంలో ఉన్నత స్థానంలో స్థిరపడేలా ప్రణాళిక బద్ధంగా పిల్లలను చదివించాలని తల్లిదండ్రులకు వివరించారు. త్వరలో జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ ఆదేశాల మేరకు శేషంపల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాల పున్న:ప్రారంభం చేస్తామని ఎంఈఓ సురేష్ తెలిపారు.

## కస్తూర్బా పాఠశాలను సందర్శించిన కలెక్టర్

**మరికల్ మేజర్ న్యూస్:** మరికల్ మండలం పసుపుల గ్రామంలో గల కస్తూర్బా గాంధీ పాఠ శాలను మంగళవారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సందర్శించారు. పాఠశాలలో తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు, స్నానపు గదులు ఉన్నాయా లేదా అని ఎస్.వో ను అడిగి తెలుసుకున్నారు. మెనూ బోర్డు చూసి క్రమం తప్పకుండా అమలు చేయాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థులకు చదువుతో పాటు కరాటే, ఇతర కల్చరల్ కార్యక్రమాలు ఏమేమి నిర్వహిస్తారని ప్రశ్నించారు. ఇంకా ఏమేమి వసతి సౌకర్యాలు అవసరమో తెలియజేయాలన్నారు. డీఈవో గోవిందరాజులు ఇతర విద్యాశాఖ అధికారులు, తహసిల్దార్ రామ్ కోటి, ఎంపీడీఓ కొండన్న, ఎస్.వో తో పాఠశాల వసతి సౌకర్యాలపై అరగంట పాటు చర్చించారు. ఈ కార్యక్రమంలో ఏ ఎం వో విద్యాసాగర్, సెక్టోరల్ ఆఫీసర్ శ్రీనివాస్, ఎంపివో పావని తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల దాహం తీర్చిన మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి



**నర్వ మేజర్ న్యూస్:** త్రాగునీటి కొరత ఉన్న నర్వ మండల పరిధిలోని ఉందేకోడు గ్రామంలో మంగళవారం రోజు డాక్టర్ వాకిటి శ్రీహరి మంత్రి ఆదేశాల మేరకు నర్వ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బీసం చెన్నయ్య సాగర్ ఆధ్వర్యంలో ఎంపీడీవో శ్రీనివాస్ చేతుల మీదగా మోటర్‌ను స్విచ్ ఆన్ చేసి ప్రారంభించడం జరిగింది. ఉందేకోడు గ్రామంలో ప్రజలు తాగునీరు ఇబ్బందులు పడుతున్నారని, మండల నాయకులు మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి దృష్టికి తీసుకెళ్లడంతో, వెంటనే మంత్రి స్పందించి తక్షణమే అధికారులకు ఆదేశించి 1.25 లక్షలు మంజూరు చేసి వెంటనే బోరు వేయించడం జరిగింది. త్రాగునీరు సమస్యను వెంటనే పరిష్కరించినందుకు గ్రామ ప్రజలు రాష్ట్రమంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరికి, మండల నాయకులకు గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ జిల్లా జనరల్ సెక్రెటరీ నాగన్న గారి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా నాయకులు కృష్ణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు శరణప్ప, మండల ప్రధాన కార్యదర్శి వివేకవర్ధన్ రెడ్డి, రవీందర్ రెడ్డి, నర్వ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అశోక్ గౌడ్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొండప్ప, నాగప్ప, ఉమాపతి, జంగం రెడ్డిపల్లి రాజారెడ్డి, వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామ పెద్దలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# బోనస్ ఇస్తామని బోగస్ మాటలు చెప్పిన రేవంత్ సర్కార్

### - బిఆర్ఎస్ పార్టీ మల్దకల్ నాయకులు వీరేశ్ గౌడ్, డి శేఖర్ నాయుడు





**మల్దకల్ మేజర్ న్యూస్:** రైతులు పండించిన వరి ధాన్యానికి బోనస్ ఇస్తానని ప్రకటించి బోనస్ ఇవ్వకుండా బోగస్ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు సన్న రకానికి మాత్రమే బోనస్ అంటూ రైతులను మోసం చేశారని బిఆర్ఎస్ పార్టీ మల్దకల్ మండల నాయకులు మాజీ ఉప సర్పంచ్ వీరేశ్ గౌడు, నాయకులు డి.శేఖర్ నాయుడు అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు ప్రతి రైతు అందించిన వరి ధాన్యానికి మద్దతు ధరతో పాటు బోనస్ ఇస్తామని ప్రకటించి అధికారంలోకి వచ్చాక సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామని చెప్పడం రైతులకు తీరని అన్యాయం చేశారని, ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. రైతులకు ఇచ్చిన హామీలకు పంగనామం పెట్టారని దుయ్యబట్టారు. ప్రతి రైతుకు రెండు లక్షల రుణమాఫీ అన్ని రేషన్ కార్డు లెక్కల తీసుకుని సగం మంది రైతులకు మాత్రమే మాఫీ చేసి చేతులు దులుపుతున్నారని, మిగతా రైతులకు రుణమాఫీ ఎప్పుడు చేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన అన్ని రకాల వరి ధాన్యానికి రూ. 500 బోనస్ ఇవ్వాలని లేని యెడల బిఆర్ఎస్ పార్టీ గద్వాల ఇన్చార్జి బాసు హనుమంతు నాయుడు తరపున రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని వెంటనే ప్రభుత్వం అన్ని రకాల వడ్లకు బోనస్ ప్రకటించి రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని అన్నారు. రాబోవు రోజుల్లో ప్రభుత్వానికి గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలో ఉన్నాయని వారు హెచ్చరించారు.

# యూనియన్ బ్యాంకు మేనేజర్ తీరుపై ఖాతాదారుల ఆగ్రహం

### - అసభ్య పదజాలముతో నిత్యం ఖాతాదారులను దూషిస్తున్న మేనేజర్ పై చర్యలకు డిమాండ్



**చారకొండ: మేజర్ న్యూస్ :** మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ మేనేజర్ రమేష్ బ్యాంక్ కు వచ్చే ఖాతాదారులపై నిత్యం దురుసు ప్రవర్తనతో వివాదాలకు కేరాఫ్‌గా మారాడు. వివిధ పనుల నిమిత్తం వచ్చే రైతులు, మహిళలకు, వృద్ధులకు సరైన సేవలు అందించకుండా రోజుల తరబడి బ్యాంక్ చుట్టూ తిప్పించుకుంటూ ఇబ్బందులు పెడుతున్నాడని వారు వాపోతున్నారు. ఇదేమని ప్రశ్నించిన వారిపై విధి రౌడీలా ప్రవర్తిస్తూ తాము ఇలాగే పని చేస్తామని ఇక్కడ నచ్చకపోతే మీకు నచ్చిన బ్యాంక్ లో పని చేసుకోవచ్చని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నాడని పేర్కొన్నారు. గట్టిగా ప్రశ్నిస్తే మీకు దిక్కున్న చోట చెప్పుకొండని నేను ఇలాగే పని చేస్తానని దమ్ముంటే నన్ను ఇక్కడ నుంచి ట్రాన్స్ ఫర్ చేయించాలని సవాలు విసురుతున్నాడని తెలిపారు. మరికొందరిపైన అయితే ప్రత్యక్ష దాడులకు సైతం పాల్పడుతూ బ్యాంక్ నుంచి బయటకు వెళ్ళిపోవాలని చెబుతున్నాడని ఖాతాదారులు తెలిపారు. ఇంతకు ముందు ఏ మేనేజర్ కూడా ప్రవర్తించని విధంగా ప్రస్తుత మేనేజర్ రమేష్ దురుసుగా ప్రవర్తిస్తూ ఖాతాదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని, తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి మేనేజర్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# గ్రామాభివృద్ధిలో కార్యదర్శుల పాత్ర కీలకం - డీపీఓ సుధాకర్ రెడ్డి



**నారాయణపేటజిల్లా ప్రతినిధి మేజర్‌న్యూస్ :** గ్రామాభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకమని పి.సుధాకర్‌రెడ్డి ఇంచార్జి డి.పి.ఓ. పేర్కొన్నారు. మంగళవారం సింగారం డిఎంహెచ్వో కాన్ఫరెన్స్ హాల్లో భారత ప్రభుత్వం పరిపాలన సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం సిబ్బంది, పెన్షన్ల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టం, గ్రామసభలపై ఎంపిక చేసిన కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ పంచాయతీ రాజ్ 2018 -చట్టం ప్రకారం గ్రామస్థాయిలో జరుగు తున్న ప్రతి కార్యక్రమం, ప్రజలకు అందాల్సిన సేవలు, అభివృద్ధి పనులపై గ్రామ సభల్లో చర్చజరిగేలా చూడాలని, ప్రభుత్వ పథకాలను అర్హులైన వారికిదక్కేలా చర్యలు తీసుకోవాల న్నారు. సంబంధితశాఖలతో సమన్వయం చేసుకుని ఉత్తమ పంచాయతీలుగా కార్యదర్శులు వాటిని తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డియల్.పిఓ మాస్టర్ ట్రైనర్, పంచాయతీ కార్యదర్శులు, తదితరులున్నారు. రిటైర్డ్ డి.పి.ఓ. కృష్ణ, ఎం.పి.డి.ఓ. సుదర్శన్ ఫాకల్టీస్ తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్ రెడ్డి సర్కార్ పెద్దపీట

(మొదటిపేజీ తరువాయి)

పంచేతో గృహప్రవేశానికి వస్తానని ఎమ్మెల్యే మహిళలకు చెప్పారు ఇప్పుడు మంజూరు కానీ వారికి మలి విడతలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను మహిళా సంఘాలకు ఇవ్వడం జరిగింది. ప్రభుత్వ కార్యాలయాల్లో మహిళా శక్తి క్యాంటీన్లు ఏర్పాటు చేయడం జరిగింది. మహిళలు తమకిష్టమైన రంగాల్లో వ్యాపారం చేసుకోడానికి ముందుకు వస్తే ప్రభుత్వం బ్యాంకు రుణాలు ఇప్పించి ప్రోత్సహించేందుకు సిద్ధంగాఉందని తెలియజేశారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పి.డి.డీఆర్డిఒ ఉమా దేవి వనపర్తి జిల్లాలో మహిళా సాధికారితకు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. అనంతరం ప్రతి మండల సమాఖ్య నుంచి 5 మంది ఉత్తమ మహిళా సంఘాల సభ్యులకు సన్మానం చేశారు. 2025- 26 సంవత్సరానికి వడ్డీ లేని బ్యాంకు రుణాలు రూ. 29.28 కోట్ల చెక్కును మహిళా సంఘాలకు ఇచ్చారు. మహిళా సంఘాలకు ప్రమాద బీమా, లోన్ భీమా చెక్కు రూ. 16,10,000 చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో అదరపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఇన్చార్జ్ యాదయ్య వనపర్తి మార్కెట్ కమిటి చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, పీసీసీ సభ్యులు శంకర ప్రసాద్, లీడ్ బ్యాంక్ మేనేజర్ శివకుమార్, పెబ్బేరు మార్కెట్ కమిటి చైర్మన్ ప్రమోదిని జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు స్వరూప, కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు శ్రీలత,మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, మండల సమాఖ్య అధ్యక్షులు సంధ్యారాణి, నిర్మల, స్వప్న, ఇందిరా, మహేశ్వరి, శాంతమ్మ, శ్రీలత రెడ్డి, ధనలక్ష్మి కాంగ్రెస్ నాయకులు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో సాగునీటి ప్రాజెక్టులు కట్టిందే కాంగ్రెస్

- మక్తల్ -పేట -కొడంగల్ ఎత్తిపోతల పథకంతో ఊట్కూర్ ప్రాంతానికి సాగునీరు
- గత 18 ఏళ్లలో జరగని అభివృద్ధి 18 నెలల్లో చేసి చూపించిన ఘనత మంత్రి వాకిటి శ్రీహరిది
- మక్తల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు



**మక్తల్ మేజర్ న్యూస్ :** తెలంగాణలో సాగునీటి ప్రాజెక్టులు కట్టిందే కాంగ్రెస్ పార్టీ అని 18 ఏళ్లలో జరగని అభివృద్ధి 18 నెలల్లో చేసి చూపించిన ఘనత మంత్రి వాకిటి శ్రీహరిది అని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. పట్టణ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ హయాంలోనే అప్పటి ముఖ్య మంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి చేపట్టిన జలయజ్ఞంలో భాగంగా రాజీవ్ బీమా లిఫ్ట్ ఇరిగేషన్ లో భాగంగా సంగంబండ, భూత్పూర్ ప్రాజెక్టులు ఏర్పడ్డాయని, ముమ్మాటికి సంగంబండ, భూత్పూర్ ప్రాజెక్ట్ ల కృషి కాంగ్రెస్ పార్టీ దేనని అన్నారు. కాంగ్రెస్ పార్టీ చేపట్టిన రాజీవ్ బీమా ఎత్తిపోతల పథకంతోనే నేడు మక్తల్ నియోజకవర్గంలో లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని తెల్చి చెప్పారు. మంత్రి వాకిటి శ్రీహరి చొరవతో రెండు నెలల ముందుగానే బీమా ఎత్తిపోతల మోటార్లు ప్రారంభించి రిజర్వాయర్లను నింపుకుంటున్నామని, ఇప్పటికే నియోజకవర్గం వ్యాప్తంగా దాదాపు 80 శాతం చెరువులు నిండిపోయి నీటితో కళకళలాడుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కట్టా సురేష్ గుప్తా, కోళ్ల వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మార్కెట్ వైస్ చైర్మన్ గణేష్ కుమార్, టౌన్ ప్రెసిడెంట్ ఏ రవికుమార్, సీనియర్ నాయకులు గోలపల్లి నారాయణ, మార్కెట్ డైరెక్టర్లు శ్రీనివాస్, ఫయాజ్, శాలం, నాయకులు మందుల నరేందర్, కట్టా వేంకటేశ్, వల్లంపల్లి లక్ష్మణ్, అబ్దుల్ రెహమాన్, కావలి రాజేందర్, ఓబులేష్, శంషుద్దీన్, వాకిటి శ్యామ్, పంచలింగాల నగేష్, వాకిటి హనుమంతు, రహీం పటేల్, అఫ్రోజ్, నిరంజన్ గౌడ్, బ్యాగరి సురేష్, దండు ఆనంద్, దండు రాము తదితరులు పాల్గొన్నారు.

## ముమ్మరంగా విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం పనులు



**బిజినేపల్లి మేజర్ న్యూస్:** నూతనంగా మంజూరైన విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం పనులు ముమ్మరంగా సాగుతున్నాయని మండల కాంగ్రెస్ నాయకుడు గోవిందు రామకృష్ణ అన్నారు. మండలంలోని పాలెంలోని ఇండస్ట్రియల్ పార్కు ఆవరణలో చేపట్టిన విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం పనులను మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి మంగళవారం పరిశీలించి మాట్లాడారు. గత ప్రభుత్వం సబ్ స్టేషన్ నిర్మాణం పనులు చేపట్టకుండా నిర్లక్ష్యం చేయడంతో గుడ్లనర్వ, ఖానాపూర్, లింగసానిపల్లి, కారుకొండ, పాలెం గ్రామాల్లో రైతులు, ప్రజలు విద్యుత్ సరఫరాలో నిత్యం అంతరాయం కల్గి ఇబ్బందులకు గురయ్యారని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్ రెడ్డి, ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డిలు ప్రత్యేక చొరవ చూపి రూ.2.35 కోట్ల నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. రెండు నెలలోనే పనులు పూర్తి చేసి విద్యుత్ సరఫరా చేసేందుకు పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టినట్లు తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు మస్కూరి బంగారయ్య, లేట్ల వెంకట్, జయకృష్ణ, ఉదయ్ కుమార్, జగ్గని రామకృష్ణ ఉన్నారు.

## టీచర్లకు పిఆర్సీని అమలు చేయాలి

### - తపస్ జిల్లా అధ్యక్షులు సునీల్ కుమార్



**నవాబుపేట్ మేజర్ న్యూస్:** టీచర్లకు పిఆర్సీని వెంటనే అమలు చేయాలని జిల్లా తపస్ అధ్యక్షులు సునీల్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం తపస్ మండల శాఖ ఆధ్వర్యంలో మండల పరిధిలోని వివిధ పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమము చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా పోమాల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ,పిఆర్సీని వెంటనే అమలు చేయాలని, పెండింగ్ డిఏలను వెంటనే విడుదల చేయాలని,ఆరోగ్య కార్డులు, పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని,ప్రమోషన్స్,బదిలీలు చేపట్టాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం బాబు నాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాసులు,డాక్టర్ ప్రవీణ్ కుమార్ గౌడ్, మండల అధ్యక్షులు సుధీర్,ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు మణికుమార్ పాల్గొనడం జరిగింది.

## జిపిఓ, లైసెన్స్ సర్వేయార్ల పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి : అదనపు కలెక్టర్ గంగ్వార్




**నారాయణపేట జిల్లా ప్రతినిధి మేజర్‌న్యూస్:** జి.పి.ఓ,లైసెన్స్ సర్వేయర్ల పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిపిఓ లైసెన్స్ సర్వేయర్ల పరీక్షల కోఆర్డినేషన్ పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 27న ఉదయం 10 గంటల నుండి ఒంటిగంట వరకు మళ్లీ రెండు గంటల నుండి 5 గంటల వరకు జరిగే పరీక్ష లను పకడ్బందీగా నిర్వహిం చాలని తెలిపారు. చిట్టెం నర్సి రెడ్డి మెమోరియల్ డిగ్రీ కాలే జీలో 150 మంది పరీక్షలు రాస్తారని తెలిపారు. సీసీటీవీ కెమెరా నిగా లో పరీక్ష నిర్వ హించాలన్నారు. పట్టణంలోని జిరాక్స్ సెంటర్లను మూసివే యాలని అన్ని ఏర్పాట్లు చేయాలని తెలిపారు. విద్యు త్ నిరంతరం ఉండేలా అధి కారులు చర్యలు తీసుకోవా లని డిఎంహెచ్వో మెడికల్, పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమా వేశంలో డిఎస్పీ లింగయ్య, డి ఎం హెచ్ ఓ, డిఐఈఓ, ఏడి సర్వే, మున్సిపల్ కమిషనర్, టి జి ఆర్ టి సి, ట్రాన్స్కో, తసిల్దారు, ఎ. ఓ. జయసుధ తదితరులు పాల్గొన్నారు.

## 'ఏక్‌పేడ్ మాకేనామ్' అభియాన్‌లో మొక్కలు నాటే కార్యక్రమం



**ఊట్కూర్ మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని ఎర్గట్ పల్లి గ్రామంలో మంగళవారం మేరా యువ భారత్ కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాల క్రీడాశాఖ ఆధ్వర్యంలో 'ఏక్ పేడ్ మాకే నామ్' అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక అంగన్వాడి ఆవరణలో మొక్కలు నాటారు. ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కవిత, ప్రోగ్రాం కోఆర్డినేటర్ అనిల్, మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం వల్ల పర్యావరణాన్ని పరిరక్షించడంలో భాగస్వాములు అవుతారన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు కంప్యూటర్ విద్యపై పట్టు సాధించాలి

### - కొత్తకోట. మణిగిల్ల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నేర్పిస్తున్న ఏఐ శిక్షణను తనిఖీ చేసిన కలెక్టర్



**వనపర్తి ప్రతినిధి మేజర్ న్యూస్ :** పిల్లలకు బాల్యం నుంచే కంప్యూటర్ విద్యపై పట్టు సాధించేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశ పెట్టిన కృత్రిమ మేధస్సు (ఎఐ) శిక్షణ కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం ఉదయం కొత్తకోట మున్సిపాలిటీలోనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పెద్దమందడి మండలంలోని మనిగిల్ల గ్రామం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి 3-5వ తరగతి విద్యార్థులకు నేర్పిస్తున్న కృత్రిమ మేధస్సు శిక్షణ తరగతులను కలెక్టర్ తనిఖీ చేశారు. కంప్యూటర్ పైవిద్యార్థులు చేస్తున్న లెక్కలను నిశితంగా పరిశీలించారు. జిల్లాలో ఎన్ని పాఠశాలల్లో కృత్రిమ మేధస్సు (ఎ.ఐ) శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు? ఎన్ని కంప్యూటర్లు ఉన్నాయి? ఎంతమంది విద్యార్థులు నేర్చుకుంటున్నారు అనే వివరాలను జిల్లా విద్యా అధికారిని వివరాలు అడిగారు. ప్రభుత్వఉన్నతపాఠశాల, ప్రాథమిక పాఠశాల ఒకే ప్రాంగణంలో ఉన్న 11 పాఠశాలల్లో 3-5వ తరగతి విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నట్లు డి.ఈఓ తెలిపారు. అదేవిదంగా 6 నుంచి 12వ తరగతి కె.జి.బి.వి, మోడల్ స్కూల్ విద్యార్థులకు ఖాన్ అకాడమీ కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నట్లు తెలియజేశారు. కంప్యూటర్ శిక్షణ ఇస్తున్న అన్ని పాఠశాలల్లో ఇంటర్నెట్ సమస్య లేకుండా నాణ్యమైన ఇంటర్నెట్ కనెక్షన్ తీసుకోవాలని, విద్యార్థులు కృత్రిమ మేధస్సు శిక్షణ తీసుకునేటప్పుడు హెడ్ సెట్ తప్పకుండా పెట్టాలని సూచించారు. ప్రతి విద్యార్థికి ఇచ్చిన యూజర్ ఐ.డి ఎవరి ఐ.డి వారే వాడేవిధంగా చూడాలని సూచించారు. పదవ తరగతి లెక్కల సబ్జెక్ట్ బోధించడానికి ప్రత్యేకంగా రూపొందిచిన హ్యాండ్ బుక్ విద్యార్థులకు అందరికీ ఇచ్చారా? హ్యాండ్ బుక్ ప్రకారం లెక్కల పాఠాలు బోధిస్తున్నారా అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధించాలని, ఈ సంవత్సరం లెక్కల సబ్జెక్ట్ లో ఒక్క విద్యార్థి ఫెయిల్ కావడానికి వీలులేదని సూచించారు అనంతరం అక్కడే కొత్తగా నిర్మిస్తున్న పా%శ్రీ%ఠశాల అదనపు గదుల భవన నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణం నిర్ణిత గడువు లోగా పూర్తి చేసేవిధంగా చూడాలని కాంట్రాక్టర్ కృష్ణా రెడ్డిని సూచించారు. జిల్లా విద్యాశాఖ అధికారి మమ్మద్ అబ్దుల్ ఘని, కొత్తకోట తహసిల్దార్ వెంకటేశ్వర్లు, పెద్దమందడి తహసీల్దార్ సరస్వతి, సి.యం.ఓ మహానంది, ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వెంట ఉన్నారు.

## మిడ్జిల్‌లో వరుస దొంగ తనలతో వణికిస్తున్న దొంగలు





**మిడ్జిల్ మేజర్‌న్యూస్:** మిడ్జిల్ మండల కేంద్రంలో మంగళవారం పట్టపగలు మిట్ట మధ్యాహ్నం భారీ దొంగతనం చోటుచేసుకుంది. మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ఉన్న పశువుల సంతా బజార్ కాలనీలో దొంగలు టార్గెట్ చేశారు. ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో ఉన్న లక్ష రూపాయలు, తులం బంగారం, పది తులాల వెండి విలువైన వస్తువులు ఉనట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. ఇంట్లో దంపతులు ఇద్దరు ఓ స్కూల్ లో ప్రవైట ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. దాదాపుగా 11 గంటల నుండి మద్యాహ్నం 12 గంటల మధ్య దొంగతనం జరగిందని బాదితుడు లింగం పోలీసులకు తెలిపాడు. గత కొంతకాలంగా మిడ్జిల్ మండల పరిధిలో వరుసగా దొంగతనాలు చేసినప్పటికీ సంబంధిత శాఖ స్పందించకపోవడం వల్లే దొంగతనాలు జరుగుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎస్ఐ శివ నాగేశ్వర్ నాయుడు తెలిపిన వివరాల ప్రకారం సంఘటన స్థలానికి ఆధారాలు సేకరించామని ఇంటి యజమానులకు ఇటీవల కాలంలో ఎవరైనా తోబుట్టులతో విభేదాలు ఉన్నాయా? అనుమానస్పదంగా తిరుగుతున్న వ్యక్తులపై సమాచారం ఉందా? అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతుందన్నారు. సిసి కెమెరాలు కూడా విశ్లేషిస్తున్నామని తెలిపారు. ఈ ఘటనతో మండల కేంద్రంలోని ప్రజల్లోఆందోళన వ్యక్తం అవుతుంది. రాత్రి వేళలో పోలీసులు నిగా పెంచాలని వీధిలైట్లు, సి సి కెమెరాలు ఉన్నచోట్ల మరమ్మతులు చేయాలని అధికారులను కోరుతున్నారు.

## ప్రైవేట్ స్కూల్ బస్ డ్రైవర్స్‌కు సంక్షేమ బోర్డుని ఏర్పాటు చేయాలి

### - టియుసిఐ జిల్లా అధ్యక్షులు ఎస్ కిరణ్



**మక్తల్ మేజర్‌న్యూస్:** ప్రైవేటు స్కూల్‌బస్సు డ్రైవర్ యూనియన్ అనుబంధం టియుసిఐ జనరల్ బాడీ సమావేశం పట్టణ కేంద్రంలోని నల్లజానమ్మ దేవాలయంలో జరిగింది.ఈ సమావేశానికి అనిల్ అధ్యక్షత వహించగా టియుసిఐ జిల్లా అధ్యక్షులు ఎస్ కిరణ్, ఆటో అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఈసరి రమేష్ హాజరై మాట్లాడుతూ ప్రైవేట్ స్కూల్ బస్సు డ్రైవర్‌కు చట్ట ప్రకారం వేతనాలు ఇవ్వాలని కోరారు. సీట్ కెపాసిటీకి మించి విద్యార్థులని ఎక్కించిన బాధ్యత తోటి విద్యార్థులను పాఠశాలకు చేర్పించడంలో తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పనికి మించిన భారంతో మానసికంగా చాలా ఇబ్బందులకు గురి అవుతున్నారు. ఫిట్నెస్ లేని బస్సులను ఇచ్చి డ్రైవర్స్ మీద నెట్టివేయడం దారుణం అన్నాడు. ప్రభుత్వాలు ప్రైవేట్ స్కూలు బస్సు డ్రైవర్స్ కి సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని బోర్డ్ ద్వారా ఇన్సూరెన్స్ తదితర సౌకర్యాలను కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు డ్రైవర్స్ పట్ల దురుసుగా ప్రవర్తించడం మాను కోవాలన్నారు. చట్ట ప్రకారం తగిన వేతనాలు ఇచ్చి వారి గౌరవాన్ని కాపాడుకోవాలని గుర్తు చేశారు. స్కూల్ బస్సు డ్రైవర్స్ పైన అక్కడక్కడ దాడులు జరుగుతున్నాయని ఈ దాడులకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని డ్రైవర్స్‌కి పిలుపునిచ్చారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా రఘు ఉపాధ్యక్షులుగా అరవింద్ కార్యదర్శిగా భీమయ్య సహాయ కార్యదర్శిగా భాస్కర్ రెడ్డి కోశాధికారిగా శివ, పరశురాంలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో వెంకట్ రెడ్డి, గోవింద్, సంజీవ్, రాజు, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్స్‌ను వెంటనే విడుదల చేయాలీ

### - పిడిఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి కే పవన్ కుమార్




**వనపర్తి టౌన్ మేజర్ న్యూస్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని విద్యా శాఖలలో రూ.7,000 కోట్ల పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాం ముఖ్యమంత్రి కి ప్రగతిశీల ప్రజాస్వామ్యం విద్యార్థి సంఘం తరపున రాష్ట్రంలోని వేలాది మంది విద్యార్థుల తరపున ఈ పోస్ట్ కార్డు లేఖ ద్వారా తెలియజేస్తున్నాం విద్యారంగంలో ముఖ్యమైన సమస్యగా నిలిచిన ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యపై మీ దృష్టిని మరల ఆకర్షించదలిచాము. ఇటీవల మా సంఘం నిర్వహించిన విద్యార్థుల యూనియన్ సమావేశంలో ఈ సమస్యపై గంభీర చర్చ జరిగింది. అనేక విద్యార్థులు తమ కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా చదువు కొనసాగించలేని పరిస్థితుల్లో ఉన్నారు. ఈ నేపథ్యంలో మా ప్రధాన అభ్యర్థన పాయింట్ల రూపంలో ఈ క్రింది విధంగా: రాష్ట్రంలోని అన్ని విద్యాశాఖల్లో (ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, డిప్లొమా, నర్సింగ్ మరియు ఇతర సాంకేతిక విద్యా సంస్థల) ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద రూ.7,000 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ పెండింగ్ బకాయిలు కారణంగా అనేక విద్యార్థులు వారి విద్యను కొనసాగించలేని పరిస్థితిలో ఉన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రారంభమైనప్పటికీ, ముస్ముందు తరగతులలో రీజిస్ట్రేషన్‌లు నిలిచిపోవడం, ప్రాజెక్టులు మరియు ఇంటర్న్‌షిప్‌లలో పాల్గొనడం కూడా కష్టంగా మారింది. ఈ పెండింగ్ సమస్యతో విద్యార్థులపై మానసిక ఒత్తిడి అధికమవుతోంది. మీరు విద్యార్థులకు అండగా నిలుస్తారని మా నమ్మకం. మీ ఆదేశాల కోసం ఎదురుచూస్తూ, విద్యార్థి హక్కుల కోసం నిరంతరం పోరాడే మా సంఘం తరపున ఈ లేఖను మీకు సమర్పిస్తున్నాము. ఈ కార్యక్రమంలో పీడిఎస్‌యు జిల్లా కార్యదర్శి రాజు, అనిల్, కవిత, రాజేందర్ ,ప్రవీణ్ కల్పనాతో పాటు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా భద్రు నాయక్ జన్మదిన వేడుకలు



**బాలానగర్, మేజర్ న్యూస్ :** కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు, పార్టీ సీనియర్ నాయకుడు భద్రు నాయక్ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో పెద్దపల్లి చౌరస్తాలోని దోస్త్ చాయి దగ్గర కేక్ కటింగ్ కార్యక్రమాలు నిర్వహించి శాలువాలతో ఘనంగా సన్మానించారు. కాంగ్రెస్‌పార్టీలో చురుకైన పాత్ర పోషిస్తున్న భద్రు నాయక్ భవిష్యత్తులో మరిన్ని పదవులు పొందాలని పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మామిడి గుట్ట శంకర్ నాయక్ సీనియర్ నాయకులు దత్తాత్రేయ వెంకటరెడ్డి, భాస్కర్ నాయక్, యాదయ్య, నవీన్ రెడ్డి పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఉచిత నోట్ పుస్తకాల పంపిణీ



**బిజినేపల్లి మేజర్ న్యూస్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్న నోట్ పున కాలను విద్యార్థులకు పంపిణీ చేసినట్లు ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ తెలిపారు. మండలంలోని కారుకొండలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల్లోని విద్యార్థులకు మంగళవారం ఉచిత నోట్ పుస్తకాలను అందజేసి ప్రభుత్వం అందిస్తున్న మద్యాహ్న భోజనం, యూనిఫాం, పుస్తకాలు వంటి వాటిని సద్వినియోగం చేసుకొని బాగా చదువుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాగ్యలక్ష్మి, శ్రీకాంత్, ఇంద్రాణీ ఉన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ : మున్సిపల్ చైర్మన్



**అచ్చంపేట మేజర్ న్యూస్ :** తెలంగాణ రాష్టంలో ప్రతిష్టత్మకంగా చేపట్టుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో భాగంగా మంగళవారం అచ్చంపేట పట్టణంలో లో మున్సిపల్ చైర్మన్ 5,13వార్డ్ లలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి పట్టణ మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. అందుకుగాను కాలనీ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అచ్చంపేట పట్టణ కౌన్సిలర్లు ఆకుల లావణ్య వెంకటేష్, రాఘవులు, మున్సిపల్ కో-ఆప్షన్ మెంబెర్‌లు ఖాదర్ పాషా. కపిలవాయి చెంద్రశేఖర్. 20వ వార్డ్ కాంగ్రెస్ ఇంచార్జి లక్ష్మణ్ బాబు. కాంగ్రెస్ నాయకులు నరుమాళ్ళ విష్ణు,లాలు యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు,అభిమానులు పాల్గొన్నారు.

## పెచ్చులు ఊడిపోతున్న ఓవర్ హెడ్ ట్యాంక్



**గోపాలపేట మేజర్‌న్యూస్:** మండలకేంద్రంలోని ఈదమ్మ గడ్డ దగ్గర మంచినీటి సరఫరాకై మూడు దశాబ్దాల క్రితం టిడిపి ప్రభుత్వం హయాంలో దాదాపు 10 లక్షల రూపాయలు వెచ్చించి ఓవర్ హెడ్ ట్యాంకును నిర్మించారు అప్పట్లో బోర్లు వేసి నీటిని నింపి సరఫరా చేయాలని అప్పటి ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది కానీ అప్పట్లో ఆ ప్రయత్నాలు సఫలం కాలేదు. బోర్లలో సరైన నిరు రాకపోవడంతో కొంతకాలం నిరుపయోగంగా ఉండిపోయింది అయితే బోర్ల ద్వారానే గ్రామానికి నేరుగామంచినీటి సరఫరా చేసేవారు కాగా గోపాలపేట తాడిపర్తి గ్రామాల మధ్య రామన్ పాడు సంపు నిర్మించి రామన్ పాడు ద్వారా నీటిని తీసుకొచ్చి సంపులోకి ఏర్పాటు చేశారు అక్కడి నుండి ఓవర్ హెడ ట్యాంక్‌కు నీటిని నింపి మంచినీటిని గ్రామానికి సరఫరాను ఏర్పాటు చేశారు అప్పటినుంచిఈ ట్యాంకు సద్వినియోగంలో ఉన్నది టిఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతి ఇంటికి నల్లాలు ఏర్పాటు చేయాలని ఉద్దేశంతో మిషన్ భగీరథపథకం చేపట్టారు ప్రస్తుతం ఈ ట్యాంక్ నుండేమండల కేంద్రానికి మిషన్ భగీరథ పథకం ద్వారా మంచినీటి సరఫరా అవుతుంది ట్యాంకు పెచ్చులూడి శిథిలావస్థకు చేరుకొని ఎప్పుడు కింద పడుతుందో అని పలువురు చర్చించుకుంటున్నారు పెచ్చులు ఊడిపోతున్న విషయాన్ని అధికారులు చూసిన పట్టించుకోవడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు శిథిలావస్థకు చేరుకొని ట్యాంకి కింద పడక ముందే మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

# తెలకపల్లిలో విచ్చలవిడిగా మద్యం బెల్ట్ షాపులు

**- నిమ్మకు నీరెత్తినట్లు ఎక్సైజ్ అధికారులు**

**- ప్రజల తీవ్ర ఆవేదన**



**తెలకపల్లి మేజర్‌న్యూస్:** తెలకపల్లి మండల కేంద్రంలో ఎటు చూసినా విచ్చలవిడిగా మద్యం బెల్ట్ షాపులు నెలకొని ఉండడం వింతగా మారింది . సమస్యపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఎక్సైజ్ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. లింగాల నుండి తెలకపల్లి కి వచ్చే ప్రధాన రహదారి వెంట అదేవిధంగా అచ్చంపేట నుండి తెలకపల్లి కి వచ్చే ప్రధాన రహదారి , నాగర్ కర్నూల్ నుండి తెలకపల్లి కి వచ్చే ప్రధాన రహదారి వెంట ముందుగా మద్యం బెల్ట్ షాపు లే దర్శన మిస్తున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు . మండలంలోని వివిధ గ్రామాల నుంచి మండల కేంద్రానికి వచ్చే అంతర్గత రహదారుల వెంట కూడా మద్యం దుకాణాలు దర్శనమిస్తున్నాయి . బెల్ట్ షాపులు పక్కన టిఫింగులు ఏర్పాటు చేసి ఆపరిశుభ్రమైన ఆహారం పదార్థాలు అధిక ధరలతో నడిపిస్తున్నారు . స్థానికంగా ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం ఉన్నప్పటికీ అధికారులు, సిబ్బంది మాత్రము పట్టించుకోక పోవడం సిగ్గుచేటని ప్రజలు విమర్శిస్తున్నారు. మండలంలోని ప్రతి గ్రామంలో కనీసంగా రెండు లేదా మూడు బెల్ట్ షాపులకు తక్కువగా లేకుండా నడిపిస్తున్నారు . సంబంధిత శాఖ అధికారులు బెల్ట్ షాపులతో కుమ్మక్కై మామూల పర్వం కొనసాగిస్తున్నారు. ఎక్సైజ్ అధికారుల తీరుపై ప్రజలు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. ఇటీవల బెల్టు షాపుల కారణంగా కొన్ని కుటుంబాల మధ్య ఘర్షణ పడ్డాయి. వారు చివరికి పోలీస్ స్టేషను వెళ్లారు సంబంధిత అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకొని గ్రామాల్లో ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## ఎకోలాజిస్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్‌కు మీ పండ్ల తోటలు ఇవ్వండి

**- నీలహళ్లి గ్రామసభలో ప్రతిపాదన పెట్టిన రవికుమార్ - పంచాయతీ కార్యదర్శి ప్రదీప్ కుమార్**



**ధరూర్ మేజర్‌న్యూస్:** మండలపరిధిలోని నీలహళ్లి గ్రామంలో గ్రామపంచాయతీ కార్యదర్శి ప్రదీప్ కుమార్ తో పాటు టెక్నికల్ అసిస్టెంట్ రవికుమార్ నీలహళ్లి గ్రామంలో పండ్లతోటలు సాగుచేసే రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ 30 సంవత్సరాల పాటు ఎకోలాజిస్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ కు మీ భూములు అప్పగిస్తే వాటికి సంబంధించి 30 సంవత్సరాల పాటు మెయింటెనెన్స్ ప్రైవేట్ కంపెనీ అందిస్తుందని తెలిపారు. ఇంతలోపు యాజమాన్యపు హక్కులు గాని. భూమి హక్కులు గాని రైతు కోల్పోయేందుకు ఆస్కారం లేదని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంలో హరితవనలు పెంచేందుకు ఈ నిర్ణయం తీసుకునిందని తెలియజేశారు. ఈ ప్రాజెక్టుకు భూములు అందించేవారు తమకు సంబంధించిన పాసుపుస్తకం, బ్యాంక్ అకౌంట్, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలతో ఫీల్డ్ అసిస్టెంట్ కు అందజేయాలని టెక్నికల్ అసిస్టెంట్ రవికుమార్ రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ వీరన్న, రైతులు నాగేంద్ర, లక్ష్మన్న, రాము రాజేందర్, ఉరుకుందు, ఈరన్న, హొటల్ సురేష్, కార్మికులు దుబ్బ రంగన్న, బుడ్డ వీరన్న, కురుమన్న, తదితరులు పాల్గొన్నారు.

## ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు : జిల్లా ఏడిఏ సంగీత లక్ష్మి



**మల్దకల్ మేజర్ న్యూస్:** అధిక ధరలుకు ఎరువులు విక్రయించి రైతులను మోసగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఏడిఏ సంగీత లక్ష్మి ఎరువుల దుకాణాల డీలర్లను హెచ్చరించారు. మంగళవారం జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రంలో రైతు వేదిక దగ్గర ఎరువుల వ్యాపారస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా ఏడిఏ సంగీత లక్ష్మి హాజరై, ఈ సందర్భంగా మాట్లాడుతూ డిఏపి, యూరియా, ఎంఒపి, కాంప్లెక్స్ ఎరువులను కావలసినంత అందుబాటులో డీలర్లు ఉంచుకోవాలని, రైతులకు డిఏపి తో పాటు నానో డిఏపి, నానో యూరియా వాటి యొక్క ఫలితాల గురించి రైతులకు తెలియజేయాలి.ఎం.ఆర్.పి రేట్లపై అధిక ధరలకు విక్రయించినట్లు అయితే చట్టపరమైన చర్యలు తీసుకోబడును, ఈ పాస్ మిషన్ ద్వారా విక్రయించాలి. మండలంలో తగినంత యూరియా నిలువలు ఉన్నాయని ఇవి వర్షాకాలం పంటలకు సరిపోతుందని, ఇటీ విలువపై రైతులు ఎలాంటి ఆందోళనలు చెందాల్సిన అవసరం లేదని తెలియజేశారు. అంతేకాకుండా ఆగ్రో రైతు సేవ కేంద్రాల్లో కొపరేటివ్ సొసైటీలలో తగినంత ఎరువులు పెట్టుకోవాలి. ఎరువుల డీలర్లు రైతులను ఇబ్బంది పెట్టవద్దని రైతులు రైతులకు ఉపయోగము లేని ఎరువులను బలవంతంగా అంటగట్టరాదని జిల్లా ఏడిఏ సూచించారు. మండల వ్యవసాయ శాఖ అధికారి రాజశేఖర్ మాట్లాడుతూ ఎరువులు రైతులకు అందుబాటులో ఉండేటట్లు చూడాలని దుకాణదారుల నుంచి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఎరువులతో పాటు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని కోరారు. రైతులకు ఇచ్చే ఎరువుల ఉపయోగాలను కూడా రైతులకు తెలియజేయాలని రైతు ఏ పంటకు, ఏ ఎరువు తీసుకువెళుతున్నాడో కనుక్కొని సరియైన ఎరువులు మాత్రమే రైతుకు అందజేయాలని సూచించారు. రికార్డులు పక్కగా నిర్వహించాలని లేనియెడల చట్టపరమైన చర్యలకు బాధ్యత వహించాల్సి వస్తుందని తెలిపారు. రైతులకు అన్యాయం జరిగితే సహించేది లేదని మండల వ్యవసాయ శాఖ అధికారి రాజశేఖర్ హెచ్చరించారు.

## మున్సిపాలిటీలో మురుగునీరు... ఈ సమస్య తీరేది ఎన్నడు..?






**మద్దూర్ మేజర్ న్యూస్:** మున్సిపాలిటీ కేంద్రం లోని మెయిన్ రోడ్డు కు ఉన్న డ్రైనేజి అస్తవ్యస్తంగా మారింది. నారాయణ పేట, కోస్గి వైపు వెళ్లే ప్రధాన రోడ్డు పనులను గత ఏడాది నుంచి నత్త నడకన ఎట్టకేలకు సీసీ రోడ్డు వేశారు.పక్కనే ఉన్న ప్రధాన డ్రైనేజి పనులు కూడా వెంటనే చేస్తామని ఇంతవరకు చేపట్టలేదని దుకాణదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రోడ్డు సరే మరి డ్రైనేజీ సంగతేందని కాంట్రాక్టర్ ను దుకాణం ఓనర్లు, స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు.మెయిన్ రోడ్డు పనులు చేపట్టడంతో వార్డుల నుంచి వచ్చే డ్రైనేజి దెబ్బ తిని మురుగు నీరుకు దారి లేక అక్కడే ఆగిపోవడం తో దుర్వాసన తో పాటు దోమల బెడదా ఎక్కువైందని దుకాణం ఓనర్లు తమ గోడును వినిపించారు.దుకాణం లో కూర్చోలేక ఇబ్బందులు పడుతున్నామని ఇలానే ఉంటే రోగాలు వచ్చే ప్రమాదం ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గల్లీ రోడ్డు లో వెళ్లాలంటే ఇటు ప్రయాణికులకు ఇబ్బంది గా మారిందని అన్నారు. మున్సిపల్ కమీషనర్ దీనిపై వెంటనే స్పందించి డ్రైనేజి శుభ్రం చేసేలా చర్యలు చేపట్టాలని దుకాణదారులు కోరుతున్నారు. ఇట్టి విషయంపై స్థానిక మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ ను వివరణ కోరగా అట్టి డ్రైనేజీ ను వెంటనే శుభ్రపరచి, దుర్వాసన రాకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తామని అన్నారు.

## గూంజ్ సంస్త సహకారంతో ఉచిత స్కూల్ బ్యాగుల పంపిణీ



**నర్వ మేజర్‌న్యూస్:** మండలపరిధిలోని సిపూర్ గ్రామంలో మంగళవారం రోజు గూంజ్ ఎన్‌జిఓ వారి సహకారంతో, వరదాస్ ఆధ్వర్యంలో ఉచిత స్కూల్ బ్యాగుల పంపిణీ చేపట్టడం జరిగింది. గుంజ్ సంస్థ ఆధ్వర్యంలో సిపూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు దాదాపు ఒక్కొక విద్యార్థికి 1500 రూపాయల విలువైన బ్యాగులు, నోట్‌బుక్స్, ఆటబొమ్మలు, పెన్సిల్ తదితర వస్తువులతో కూడిన సామాగ్రిని ఉచితంగా గ్రామపంచాయతీ కార్యదర్శి గంగాధర్ చొరవతో విద్యార్థులకు గూంజ్ సమస్త సభ్యులు గద్దె గూడెం వరదాస్ చేతుల మీదగా స్కూల్‌లో ఉన్న మొత్తం విద్యార్థులకు అందజేయడం జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జనార్ధన్ మాట్లాడుతూ మా పాఠశాల విద్యార్థులకు విలువైన ఆట వస్తువులను, బ్యాగులను పంపిణీ చేసినందుకు గూంజ్ సమస్త వారికి మరియు వరదాస్ కు కృతజ్ఞతలు అని తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ సిహెచ్ మల్లేశ్వరి, అంగన్వాడి టీచర్ గాయత్రి దేవి, దాసరి ఆంజనేయులు, గ్రామ ప్రజలు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రెండవ సారి ఉత్తమ సొసైటీ నాబార్డ్ అవార్డుకు ఎంపికైన ఉప్పునుంతల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం



**ఉప్పునుంతల మేజర్‌న్యూస్:** నాబార్డ్ 44వ వార్షికోత్సవ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా అత్యుత్తమ ఉత్తమ సేవలు అందించిన సొసైటీలలో ఉత్తమ కోపరేటివ్ సొసైటీ గా పిఎసిఎస్ ఉప్పునుంతల ఎంపికైంది. ఈ అవార్డును వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మరియు%ఞాజాూదీ% చైర్మన్ మార్నేని రవీందర్ రావు, సహకార కమిషనర్ సురేంద్రమోహన్, %చీూ్రాజాూదీ% చైర్మన్ కొండూరు రవీందర్రావు ,నాబార్డ్ %జ+వీ% ఉదయ్ భాస్కర్ చేతుల మీదుగా %ూాజూ% ఉప్పునుంతల సంఘం అధ్యక్షులు%వీణజజదీ% డైరెక్టర్ సత్తు భూపాల్‌రావు, సీఈఓ కొత్త రవీంద్రరావు అందుకోవడం జరిగింది. సంఘ అధ్యక్షులు ఎండిసిసిబి డైరెక్టర్ సత్తు భూపాల్ రావు గారు స్పందిస్తూ సంఘ అభివృద్ధికి సహకరిస్తున్నటువంటి అచ్చంపేట శాసనసభ్యులు చిక్కుడు వంశీకృష్ణ గారికి మరియు ఎంపీ మల్లు రవికి మరియు డిసిసిబి చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్ రెడ్డికి, సంఘ సభ్యులకి పాలకవర్గ సభ్యులకి మరియు సంఘ సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## చట్టబద్ధమైన రిజర్వేషన్లతోనే ఎన్నికలు నిర్వహించాలి : మాజీ ఎంపిపి అమ్మకొళ్ల



**నారాయణపేట జిల్లా ప్రతినిధి మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం బిసి రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని నారాయణపేట మాజీ ఎంపిపి అమ్మకోళ్ళ శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు.బిసి రిజర్వేషన్ల కోసం మంగళవారంఇందిరా పార్క్ వద్ద జరిగిన దర్నాలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం వైఖరి చూస్తుంటే మళ్ళీ బిసిలని మోసం చేసేకుట్రగా స్పష్టమవుతున్నదని అన్నారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు పై రాష్ట్ర ప్రభుత్వంలోనే స్పష్టతనీ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్త శుద్ధి ఉంటే బిసి రిజర్వేషన్లపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.కామారెడ్డి డిక్లరేషన్ ను తొక్కి పెట్టడానికే కాంగ్రెస్ జిమ్మిక్కులు చేస్తున్నదని విమర్శించారు.

## అజ్జకొల్లులో బైలెల్లిన బోనాలు



**మదనాపురం మేజర్ న్యూస్:** మదనాపురం మండలం అజ్జకొల్లు గ్రామంలో ఆషాడ మాసం చివరి దశలో ఘనంగా బోనాల పండుగ జరిగింది. మహిళలు బోనాలు ఎత్తుకొని డప్పుచప్పులతో ఊరంతా ఊరేగింపుతో నృత్యాలు చేసుకుంటూ గ్రామ పెద్దలు, చిన్నారులు,పోచమ్మకు పొట్టేలు, నాటు కోళ్లతోమొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వాకిటి సత్యం, పరశురాం రెడ్డి, బ్రహ్మం, గొల్ల శివన్న, జయన్న, గుగ్గిళ్ళ కృష్ణయ్య,గ్రామ పెద్దలు మహిళ లు చిన్నారులు యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అడ్డగోలుగా నీళ్ల దందా

- పుట్టగొడుగుల్లా వాటర్ ప్లాంట్లు
- అపరిశుభ్రత క్యాన్‌లలో సరఫరా..
- చూసి చూడనట్టు వ్యవహరిస్తున్న అధికారులు...



**మల్దకల్ మేజర్ న్యూస్:** జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలంలోని ఆయా గ్రామాలలో విచ్చలవిడిగా వాటర్ ప్లాంట్ లు వెలుస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ఇండ్లనే ప్లాంట్లు పెడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. అందరికీ మంచినీరు అందాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సరఫరా చేస్తున్న భగీరథ నీటిని కాదని ప్రజలు బాటిల్ వాటర్ తాగడానికి మొగ్గుచూపుతున్నారు.దీన్ని ఆసరాగా తీసుకుంటున్న వాటర్ ప్లాంట్ యజమానులు మోసాలకు పాల్పడుతున్నారు. ఎలాంటి నిబంధనలు పాటించకుండా నీళ్లు అమ్ముకుంటున్నారు. మండలంలో మినరల్ వాటర్ పేరిట కొందరు వ్యాపారులు జనం ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. నిబంధనలకు నీల్లోదిలి ప్రజల ప్రాణాలను హరిస్తున్నారు. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న వాటర్ ప్లాంట్ కేంద్రాల్లో నీటి శుభ్రతను గాలికొదిలేస్తున్నారు. బోరు వాటర్ ను శుద్ధి చెయ్యని క్యాన్లలో నింపుతూ మినరల్ వాటర్ గా సరఫరా చేస్తున్నారు. మండలంలో గ్రామానికి ఒక వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నారు. ఎక్కడ కూడా నాణ్యత ప్రమాణాలను పాటించకుండా ప్యూరిఫైడ్ వాటర్ పేరుతో అపరిశుభ్రత నీటిని క్యాన్ లలో నింపుతూ యథేచ్ఛగా వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారు. మండలంలో 15 వరకు వాటర్ ప్లాంట్ లు ఉన్నాయి. గ్రామపంచాయతీ అధికారుల అనుమతితో వాటర్ ప్లాంట్ ను ఏర్పాటు చేయాల్సి ఉండగా అవేమీ పట్టించుకోకుండా తక్కువ ఖర్చుతో ఎలాంటి నాణ్యత ప్రమాణాలు పాటించకుండా విచ్చలవిడిగా వాటర్ ప్లాంట్ ను ఏర్పాటు చేస్తున్నారు.ఒక వాటర్ క్యాన్ రూ20 ఉండగా కూల్ వాటర్ రూ.40 వరకు విక్రయిస్తున్నారు. ప్రజల అవసరాలను ఆసరా చేసుకుని నాణ్యత లేని నీటిని ప్రజలకు అందజేస్తూ వాటర్ ప్లాంట్ నిర్వాహకులు సొమ్ము చేసుకుంటూ ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నారు.

**-అటువైపు కన్నెత్తి చూడని అధికారులు...** మండలంలో అనుమతులు లేకుండా మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు యథేచ్ఛగా సాగుతున్న అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడడం లేదు. గ్రామ, మండలం రాజకీయ నేతల తాయిలాలు అందుకొని అధికారులు పండించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. మండలంలో వాటర్ ప్లాంట్ నిర్వాహకులు నెల,నెల భారీగానే మామూలు అందజేయడం వల్లే అధికారులు చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు అంటున్నారు.

# నైతిక విలువలకు టియూడబ్ల్యూజె(ఐజెయూ) పనిచేస్తుంది

- టియూడబ్ల్యూజె(ఐజెయూ) రాష్ట్ర కార్యదర్శి గుండ్రాటి మధుగౌడ్
- జర్నలిస్టుల ప్రయోజనాలు, సమస్యల విషయంలో రాజీలేని పోరాటం
- జిల్లా అధ్యక్షుడు పి విజయ్ కుమార్, కార్యదర్శి సురేష్




**అచ్చంపేట అర్బన్ మేజర్‌న్యూస్:** నిక్కచ్చికతకు, నైతిక విలువలకు టియుడబ్ల్యూజే (ఐజేయు) సంఘం పనిచేస్తుందని టియుడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి గుండ్రాతి మధుగౌడ్ అన్నారు మంగళవారం అచ్చంపేట నియోజకవర్గంలోని ప్రముఖ పుణ్య క్షేత్రం ఉమామహేశ్వర దేవస్థాన ఆలయ ప్రాంగణంలో నాగర్ కర్నూల్ జిల్లా నూతన కమిటీ మొదటి కార్యవర్గ సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు పి విజయ్ కుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేయడం జరిగింది ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యదర్శి మధు గౌడ్ హాజరయ్యారు అనంతరం వారు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం, జర్నలిస్టుల ప్రయోజనాలను కాపాడే విషయంలో యూనియన్ రాజీలేని పోరాటం చేస్తుందని, ఏ ప్రభుత్వానికి వత్తాసు పలకబోదని అన్నారు. నైతిక విలువలతో కూడిన జర్నలిజం కావాలనుకునేవారు అది రాజకీయ పార్టీలకైనా,ఇతరులకైనా ఐజేయు అవసరం ఉంటుంది తప్పా,ఏ రాజకీయ పార్టీ కొమ్ముకాసే అవసరం యూనియన్ కి లేదని ఆయన స్పష్టం చేశారు నూతనంగా ఎన్నికైన జిల్లా కమిటీ నియోజకవర్గాలవారీగా జర్నలిస్టులకు హెల్త్ క్యాంపులు నిర్వహించాలని ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని సూచించారు అనంతరం జిల్లా అధ్యక్షులు పి విజయకుమార్ మాట్లాడుతూ యూనియన్ బలోపేతానికి సమస్యల పరిష్కారానికి ప్రతి సభ్యుడు కలిసి పని చేయాలని పిలుపునిచ్చారు జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ ఏర్పాటు చేసుకొని నిరంతరం జర్నలిస్టులకు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు జిల్లా కార్యదర్శి సురేష్ మాట్లాడుతూ యూనియన్ పటిష్టత విషయంలో, సమస్యల పరిష్కార విషయంలో జర్నలిస్టులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామన్నారు జిల్లా మాజీ అధ్యక్షులు గోలి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ యూనియన్ పటిష్టత ఒక అధ్యక్ష కార్యదర్శులదే కాదని ప్రతి ఒక్కరి సహకారం అవసరమన్నారు. నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో కొత్త కమిటీ యూనియన్ భవనం కోసం కృషి చేయాలని పలువురు కోరారు. ఈ సమావేశంలో మొత్తం పది తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు ఇందులో నాగర్ కర్నూల్ జిల్లాలోని ఉమామహేశ్వర క్షేత్రంతో పాటు అన్ని ప్రధాన ఆలయాల్లో ఉమ్మడి జిల్లాలో ఉన్న గుర్తింపు కలిగిన జర్నలిస్టుల కుటుంబాలకు ఉచిత ప్రత్యేక దర్శనం కల్పించాలని ఆలయ చైర్మన్ బీరం మాధవరెడ్డి, ఈవో శ్రీనివాసరావులకు వినతి పత్రం అందజేశారు. నల్లమల్ల ఫారెస్ట్ లో గల అన్ని చెక్ పోస్టులలో ఉమ్మడి జిల్లాలోని జర్నలిస్టులకు టోల్ టాక్స్ ను మినహాయించాలని జిల్లా అటవీశాఖ అధికారికి వినతి పత్రం ఇవ్వాలని తీర్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కర్ణయ్య,జిల్లా నాయకులు ,కార్యవర్గ సభ్యులు, మూడు నియోజకవర్గాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

# వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల చేతుల మీదుగా రూ : 3.16 లక్షల చెక్కు అందుకున్న డిసిసిబి చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి

**వనపర్తి ప్రతినిధి మేజర్ న్యూస్ :** కేంద్ర ప్రభుత్వ పథకం క్రింద దేశ వ్యాప్తంగా 10,000 ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్స్ ఏర్పాటు మరియు ప్రమోషన్ లో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో ఫ్‌పీఓలుగా ఎంపిక కాబడిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు పరిపాలనా వ్యయంలో భాగంగా మొదటి విడతలో రూ.మూడు లక్షల పదహారువేలకు సంబందించిన చెక్కులను సంఘాల అధ్యక్షులకు అందజేయడం జరిగినది. ఈ పథకం లో వనపర్తి జిల్లాలోని (6) ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు వనపర్తి, కొత్తకోట, ఆత్మకూరు, గోపాలపేట, పానగల్ మరియు కొప్పునూర్ ఎంపిక కాబడ్డాయి. ఇట్టి కార్యక్రమంలో వ్యవసాయ మరియు సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు చేతుల మీదుగా వనపర్తి జిల్లా నుంచి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పానగల్ అధ్యక్షులు మామిళ్లపల్లి విష్ణువర్ధన్ రెడ్డి రూ.3,16,000/- చెక్కు అందుకోవడం జరిగినది. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఫ్ పీ ఓ లుగా ఎంపిక కావడం వల్ల సంఘాలు వివిధ వ్యాపరాలు మరియు సంఘాల ద్వారా రైతులకు వివిధ రకాల సేవలు అందించడానికి అవసరమైన ఆర్థిక సహాయము,



నైపుణ్యశిక్షణా కార్యక్రమాలు నిర్వహించబడతాయని, రెండో విడతలో వనపర్తి జిల్లా లోని మిగిలిన (9) ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఫ్ పీ ఓ లుగా ఎంపిక కావడానికి తమ వంతు కృషి చేస్తామని జిల్లా సహకార అధికారి బి.రాణి తెల్పడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో వనపర్తి జిల్లా సహకార అధికారి .బి.రాణి కార్యాలయపు క్షేత్ర స్థాయి అధికారులు, సంఘ అధ్యక్షులు మరియు కార్యదర్శులు పాల్గొనడం జరిగినది.

## కౌలు రైతులకు ఏది భరోసా...!



**కృష్ణ మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 19 నెలలు కావస్తున్నా కౌలు రైతులకు భరోసా లేకుండా పోయిందని కున్ని బీఆర్ఎస్ పార్టీ యువ నాయకులు భీమ్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం మండలంలోని విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులకు రైతు భరోసా ఎకరాకు ఏడాదికి రూ. 15 వేలు,కౌలు రైతు భరోసా రూ.15 వేలు ఇస్తామన హామీ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా రూ.12 వేలతో సరిపెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత వానకాలం, యాసంగి సీజన్ లో కౌలు రైతులకు భరోసా ఇవ్వక మొండి చేయి చూపించిందని మండిపడ్డారు. స్థానిక ఎన్నికల్ల పేరిట ఈ ఖరీఫ్ సీజన్లో రైతు భరోసా పూర్తిస్థాయిలో విడుదల చేసి కాంగ్రెస్ వైఖరిని ప్రజలకు చూపించిందని విమర్శించారు. అదేవిధంగా కౌలు రైతులు పెట్టుబడి సహాయంగా భరోసా ఇప్పుడైనా అందిస్తారేమో అని ఆశగా ఎదురుచూస్తున్నారని వాపోయారు. కొద్దిపాటి భూమి తో పాటు ఇతరుల పొలాలను కౌలుకు తీసుకుని సాగు చేస్తున్న, పంట చేతికి వచ్చిన రాకపోయిన కౌలు మాత్రం క్రమం తప్పకుండా చెల్లించాల్సి వస్తుందని ,సాగు కావాల్సిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు ,కూలీల ఖర్చులు రోజు రోజుకు పెరిగిపోతున్నాయిని లబోదిబో మంటున్నారు. చిన్న సన్న కారు రైతులు అధిక దిగుబడులు రాక ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రభుత్వం రైతు భరోసాలో భాగంగా కౌలు రైతులకు సైతం పెట్టుబడి సహాయం అందిస్తే వారికి ఎంతగానో ఆసరాగా ఉంటుందని అంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలు పరిపూర్ణంగా అమలు చేయాలని , అర్హులైన లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు, వృద్ధులకు ఫించన్లు అందించాలని ఆయన డిమాండ్ చేశారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య ఆరోగ్య శిబిరం



**ఉప్పునుంతల మేజర్ న్యూస్ :** ఉప్పునుంతల మండల పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమగ్ర వైద్య ఆరోగ్య శిబిరం నిర్వహించినట్లు డాక్టర్ స్వప్న గారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మొత్తం 70 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్నవారికి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్ ఎల్ హెచ్ పీ లు డాక్టర్ అభిలాష్ , రజిని గార్లు, శివకుమార్ ఎస్ఎస్కె మేనేజర్, పద్మ,కౌన్సిలర్ సజ్జాదు అలీ భవిష్య భారత్ మరియు టీం సిబ్బంది. శరత్ ఎస్టిఎల్ఎస్, కుమార చారి ఫార్మసిస్ట్, ప్రభావతి హెల్త్ సూపర్వైజర్లు, ల్యాబ్ టెక్నీషియన్ హెల్త్ అసిస్టెంట్ లు, ఏఎన్ఎం లు, ఆశా కార్యకర్తలు ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల భూమీ పూజాలో కాంగ్రెస్ నాయకులు



**కొత్తకోట రూరల్ మేజర్ న్యూస్:** కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో 14వ వార్డులో ఇందిరమ్మ ఇండ్ల భూమి పూజ కార్యక్రమం దేవరకద్ర నియోజకవర్గ శాసనసభ్యులు మధుసూదన్ రెడ్డి ఆదేశానుసారంతో ఇందిరమ్మ భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తకోట మున్సిపల్ కమిషనర్ సైదయ్య మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు మదనపురం మార్కెట్ యార్డ్ చైర్మన్ పల్లెపాగు ప్రశాంత్, వనపర్తి జిల్లా కార్యదర్శులు కృష్ణారెడ్డి, బోయజ్, వనపర్తి కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి, కొత్తకోట మున్సిపాలిటీ మాజీ కోఆప్షన్ సభ్యులు మీషేక్,సంద వెంకటేష్, జె కె రాజు, కొమ్ము క్రాంతికుమార్,మోహన్ రెడ్డి, రవీందర్ రెడ్డి,సుభాష్, కరాటే శ్రీను, భాస్కర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు కృష్ణయ్య, జి యం ఆర్ సోషల్ మీడియా నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పిఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వరల్డ్ యూత్ స్కిల్స్ డే



**దామరగిద్ద మేజర్ న్యూస్ :** మండల కేంద్రంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ పాఠశాలలో వరల్డ్ యూత్ స్కిల్స్ డే సందర్భంగా పాఠశాల విద్యార్థులకు ఒకేషనల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో క్విజ్ , వ్యాసరచన పోటీ, ఉపన్యాస పోటీ , డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతి ప్రధానం చేశారు. యువత చెడు బారిన పడకుండా మంచి నైపుణ్యం కలిగిన యువకులుగా తయారవ్వాలని వరల్డ్ యూత్ స్కిల్స్ డే ను ఘనంగా నిర్వహించారు. మంచి పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని వివిధ రంగాలలో స్థిరపడాలని ఉపాధి అవకాశాలు కల్పించుకొని మంచి గా స్థిరపడాలని ఉపాధ్యాయులు విద్యార్థులకు తెలియజేశారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జ్యోతి ,అమృత్ ,తిప్పన ,శ్రీనివాస్ రెడ్డి, బాలరాజ్ ,లక్ష్మీనారాయణ ,అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ ఉమాదేవి ,ఒకేషనల్ టీచర్స్ సీనియర్ ఇన్స్ట్రక్టర్ శంభు లింగం , కంప్యూటర్ ఆపరేటర్ అనురాధ, అగ్రికల్చర్ శిరీషలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం ముసుగులో దళితుల అస్తిత్వంపై దాడి

**- దళిత సంఘాల రాష్ట్ర నాయకుడు మంగి విజయ్**



**బిజినేపల్లి మేజర్ న్యూస్:** కొందరు మతోన్మాదులు అంబేద్కర్ విగ్రహం ధ్వంసం ముసుగులో దళితుల అస్థిత్వం పై దాడి చేస్తున్నారని దళిత సంఘాల రాష్ట్ర నాయకుడు మంగి విజయ్ అన్నారు. మండలంలోని లింగసానిపల్లిలో సోమవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ఆవిష్కరించని అంబేద్కర్ విగ్రహం చేతి వేలును ధ్వంసం చేసినట్లు తెలుసుకొని మంగళవారం వివిధ కుల సంఘాల నాయకులు, బీఎస్పీ నాయక లతో కలిసి ధర్నా చేపట్టి నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. భారత రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి, బడుగు బలహీన వర్గాల జీవితాల్లో వెల గులు నింపిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని రాళ్ళతో కొట్టి చేయి విరగొట్టి అవమాన పర్చడం బాధకరమన్నారు. అగ్ర వర్ణాల కింద నలిగిపోత ఉన్న నిమ్నజాతుల క్షేమం కోసం, సమ సమాజ నిర్మాణం కోసం రాజ్యాంగంలో ఎన్నో హక్కులు కల్పించి గౌరవం కల్పించిన మహానీయుడి విగ్రహం పై దాడి చేసి ధ్వంసం చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేసి కఠిన శిక్షించాలని పోలీసులను డిమాండ్ చేశారు. కొన్ని రాజకీయ పార్టీలు వ తతత్వ భావాలతో ప్రేరేపించి ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలు చేయించి శాంతియుతంగా ఉన్నా పల్లెల్లో మత, కుల చిచ్చు పెడుతుందని ఆరోపించారు. మతాల కన్నా మానవత్వం ముఖ్యమని చెప్పిన అంబేద్కర్ అందరికీ ఆదర్శప్రాయుడని కొనియాడారు. ప్రపంచ దేశాలు ఆయన రచించిన రాజ్యాంగాన్ని కొనియాడుతుంటే ఇక్కడ అవహేళన చేయడం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఎదుగుదలను సహించకపోవడమేనని ఆరోపిం చారు. విగ్రహం ధ్వంసం చేసినందుకు నిరసనగా బుధవారం మండల వ్యాప్తంగా బంద్ పాటించాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. విగ్రహం ధ్వంసం చేసిన వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ కెశ్రీనివాస్ హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. అలాగే గ్రామాల్లోని చౌరస్తాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం వల్ల ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవాలని ఎస్ఐ గ్రామస్తులకు సూచించారు. అంబేద్కర్ వి గ్రహం ధ్వంసం చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేయాలని వివిధ సంఘాల నాయకులతో కలిసి ఎస్ఐ కె.శ్రీనివాస్కు పిర్యాదు చేశారు. నిరసన వక్తం చేసిన వారిలో బీఎస్పీ జిల్లా నాయకుడు కొత్తపల్లి కుమార్, ఎంఆర్పీఎస్ జిల్లా నాయకులు కరిగళ్ల దశరథం, విల్సన్, మంగి రాజు, ఏఐటీయూసీ నాయకుడు అశోక్, నరేందర్ గౌడ్ ఉన్నారు.

## కేటిదొడ్డి కేజీబీవీ ఎస్ఓ పద్మావతిని తక్షణమే సస్పెండ్ చేయాలి

**- జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణకి ఫిర్యాదు చేసిన విద్యార్థి సంఘాల నాయకులు**



**కేటీ దొడ్డి మేజర్ న్యూస్:** కేజీబీవీ లో జరిగిన సంఘటన దురదృష్టకరం అని విద్యార్థి సంఘాల నాయకులు అన్నారు దీనికి అంతటి కారణం ఆ కేజీబీవీ ఎస్ఓ. ఆమె విద్యార్థులను సరిగా పట్టించుకోకపోవడం వల్లనే ఈ సంఘటన జరిగింది. కేజీబీవీ లలో చాలా అవకతవకలు జరుగుతున్నాయి. వాటిని బయటకు రాకుండా అక్కడ ఉన్నటువంటి ఎస్వోలు మేనేజ్ చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారు. విద్యార్థులకు నాన్నమైన భోజనం గాని నాన్నమైన విద్యను గాని వసతులు గాని కల్పించ లేకుండా కప్పిపుచ్చుతున్నారు కొన్ని కేజీబీవీలలో త్రాగడానికి ఫిల్టర్ వాటర్ కూడా లేని పరిస్థితి ఉన్నది. కేజీవీబీల పైన పరివేక్షణ చేయలేనటువంటి అధికారి పైన కూడా చర్యలు తీసుకోవాలి. బిల్డింగ్ మీద నుంచి దూకి కిందపడిన అమ్మాయిని గద్వాల జిల్లా ఆసుపత్రికి తీసుకువచ్చిన సందర్భంగా అక్కడికి విద్యార్థి సంఘాలు చేరుకొని ఆమెకు మెరుగైన వైద్యాన్ని అందించాలని డిమాండ్ చేశారు. ఆ ఎస్ ఓ అక్రమంగా తల్లిదండ్రులను బ్లాక్మెయిల్ చేసి మాకు సంబంధం లేదని వారి తల్లిదండ్రుల నుంచి లెటర్ రాయించుకోవడం దుర్మార్గం. ఈరోజు జరిగిన సంఘటనలో ఆ అమ్మాయికి స్పైనల్ కార్డ్ దెబ్బతినిందని ఆర్థోపెటిక్ డాక్టర్ నాగేశ్వరరావు తెలిపిన వెంటనే హైదరాబాద్కు రిఫర్ చేయడం వల్ల ఆమెను హైదరాబాదుకు హుటాహుటిన తరలించారు. ఆమె వైద్యమునకు అవసరమయ్యే ఖర్చులన్నీ కూడా ప్రభుత్వంమే భరించి ఆమెకు మెరుగైన వైద్యాన్ని అందించాలని విద్యార్థుల సంఘాలు డిమాండ్ చేశారు. వెంటనే ఆమె మెరుగైన వైద్యం కోసం సీఎం రిలీఫ్ ఫండ్ కింద ఐదు లక్షలు ఆర్థిక సహాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు బీఆర్ఎస్వి జోగులాంబ గద్వాల జిల్లా కోఆర్డినేటర్ కురువ పల్లయ్య, పి డి ఎస్ యు జిల్లా అధ్యక్షుడు హాలీమ్ పాషా, పి వై ఎల్ జిల్లా అధ్యక్షులు దానయ్య, యుఎస్ఎఫ్ఐ రంగస్వామి.

## ప్రాథమిక పాఠశాలల్లో ఆర్ఓ వాటర్ ప్లాంట్ ప్రారంభం



**కృష్ణ మేజర్ న్యూస్ :** మండలంలోని ముడుమాల్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఆర్ఓ వాటర్ ప్లాంట్ను దాత కొత్తూర్ వెంకటమ్మ, మండల ముఖ్య అతిథుల ఆధ్వర్యంలో శిలాఫలకాని ఆవిష్కరించి రిబ్బన్ కట్ చేసి ఆర్ఓ వాటర్ ప్లాంట్ను వారు ప్రారంభించారు. కీశే"కొత్తూర్ రామకృష్ణ శెట్టి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు పాఠశాలకు 1000 లీటర్ల నీటీ సామర్థ్యం గల ఆర్ఓ వాటర్ ప్లాంట్ ను అందజేయడం పట్ల పలువురు అభినందించారు. ఈ సందర్భంగా పలువురు ముఖ్య అతిథులు మాట్లాడుతూ సర్కార్ బడిలో చదువుతున్న విద్యార్థులకు పరిశుభ్రమైన మంచి నీటి సౌకర్యం ఏర్పాటు చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. శుద్ధనీటితో 99 శాతం విద్యార్థులకు రోగాలు దరిచేరవనన్నారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తేవాలని సూచించారు. ఆర్ఓ వాటర్ ప్లాంట్ దాత కొత్తూర్ వెంకటమ్మ,కుటుంబ సభ్యులకు పాఠశాల బృందం శాలువాతో ఘనంగా సన్మానించి, కృతజ్ఞతలు తెలిపారు. బడుగు బలహీన వర్గాల పిల్లల అభ్యున్నతికై పాటు పడుతున్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఢీ.శేఖర్ను అతిథులు, గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో దాత కొత్తూర్ వెంకటమ్మ, కుటుంబ సభ్యులు, ఇంచార్జీ ఎంపీడీవో విజయలక్ష్మీ,యంఈఓ నిజాముద్దీన్,కాంప్లెక్స్ అధికారి గణేశ్ సింగ్,పీఆర్టియూ టియస్ జిల్లా అధ్యక్షులు వై. జనార్ధన్ రెడ్డి,మండల అధ్యక్షులు దండు శేఖర్,పంచాయతీ కార్యదర్శి రాజు,అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్పర్సన్ జయమ్మ, అఖిలపక్ష నాయకులు శ్రీనివాస్ రెడ్డి, వెంకటేష్, భీమశంకర్,తమ్మప్ప,అనిల్ కుమార్ గౌడ్, దండు రాఘవేంద్ర, కుర్వ బాల్ రాజ్,రాఘవేంద్ర గౌడ్, కృష్ణయ్య, హన్మన్న, వెంకటప్ప, తిమ్మప్ప, ఈరయ్య, మంగలి రమేష్, చంద్ర శేఖర్, నేరేటి వెంకటేష్, వెంకటేష్ గౌడ్, రంగప్ప,విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఆటో కార్మికుల సమస్యలపై ఎమ్మార్వో కు వినతి పత్రం

**- భగత్ సింగ్ ఆటో యూనియన్ అధ్యక్షుడు గువ్వలపల్లి కొండన్న**



**ధన్వాడ మేజర్ న్యూస్ :** ధన్వాడ మండల కేంద్రంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు పి వెంకటేష్ ఆధ్వర్యంలో భగత్ సింగ్ ఆటో యూనియన్ అధ్యక్షుడు గువ్వలపల్లి కొండన్న మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం ద్వారా ఆటో కార్మికుల ఎన్నికల ముందు ప్రతి సంవత్సరంకు 12 వేల రూపాయలు అందిస్తామని ఇంతవరకు అధికారంలోకి వచ్చి 18 నెలలు గడిచిన ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం ఆట కార్మికులకు జీవన ఉపాధి కొరకు యువత నిరుద్యోగులుగా ఉద్యోగాలు లేక జీవన ఉపాధి కొరకు ఆటోలను వివిధ ప్రవేట్ రుణాల ద్వారా తెచ్చుకొని జీవనం కొనసాగిస్తున్నారు ప్రభుత్వం ఎన్నో మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చి నేటికీ కూడా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు ఈ సమస్యలను తక్షణమే పరిష్కరించాలి ఆటో కార్మికులకు ప్రమాదవశాత్తు 10 లక్షల బీమా పథకం అంగవైకాలానికి ఐదు లక్షల బీమా సౌకర్యాన్ని అమలు చేయాలి కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి ప్రభుత్వం ఈఎస్ఐ పిఎఫ్ అమలు చేయాలి పక్కా ఇల్లు మంజూరు చేయాలి అని వివిధ డిమాండ్లతో వినతి పత్రం మండల తాసిల్దార్ సింధుజ కు అందజేశారు.ఈ యొక్క సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి అందజేస్తానని తాసిల్దార్ హామీ ఇచ్చారు. అదేవిధంగా ఆటో కార్మికుల సభ్యులు అందరం కలిసి ఈ సమస్యను స్థానిక ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని ఏ ఐ టి యు సి జిల్లా నాయకులు సంతోష్ కుమార్ జిల్లా ఉపాధ్యక్షులు పి వెంకటేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు పూజారి శ్రీరామ్. ఏం ఏ మసూద్.నీరటి ఉషనప్ప.డి రాఘవేందర్. నీరటి ఆంజనేయులు. జగదీష్. తదితరులు పాల్గొన్నారు.

## సహుద్యోగికి ఆర్థిక సహాయాన్ని అందించిన పోలీసులు



**గద్వాల ప్రతినిధి మేజర్ న్యూస్:** జిల్లా ఎ.ఆర్ హెడ్‌క్వార్టర్స్ లో పనిచేస్తున్న పోలీస్ సిబ్బంది సమూహంగా తమ సహెూద్యోగి రాజశేఖర్ కు ఆర్థిక సహాయం చేయడానికి ముందుకు వచ్చారు. ఇటీవల రాజశేఖర్ కి పుట్టిన శిశువు గర్భంలో ఉన్న ఉమ్మ నీటిని ( వుంబ్ వాటర్) మింగిన కారణంగా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న విషయం తెలిసిన వెంటనే, ఎ.ఆర్ హెడ్క్వార్టర్స్ సిబ్బంది మనస్ఫూర్తిగా డబ్బు సేకరించారు. సేకరించిన 80,000 రూపాయలను జరిగిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ టి.శ్రీనివాస రావు, ఐపీఎస్ చేతుల మీదుగా రాజశేఖర్ కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతు సహుద్యోగి ఆపద సమయంలో అందరం కలిసి ఆదుకోవడం పోలీస్ కుటుంబపరస్పర సహకారానికి అద్భుత ఉదాహరణ అన్నారు. ఈ కార్యక్రమంలో ఏవోసతీష్, ఆర్ఎస్ఐ విజయభాస్కర్ మరియు తోటి పోలీస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## చారకొండ యూనియన్ బ్యాంకులో జాతిపితకు అవమానం



**చారకొండ: మేజర్ న్యూస్ :** స్వాతంత్ర సమరయోధుడు, జాతిపిత మహాత్మా గాంధీ చిత్రపటానికి నాగరర్ కర్నూల్ జిల్లా చారకొండ మండల కేంద్రంలో యూనియన్ బ్యాంక్‌లో అవమానం జరిగింది. బ్యాంక్ మేనేజర్ రమేష్ చాంబర్‌లో గాంధీ చిత్రపటాని ఒక మూలకు పడేసిన ఎదుట బుక్కులు ,ఫైల్స్ అడ్డంగా పెట్టి ఉంచారు. బ్యాంక్ మేనేజర్ , సిబ్బంది జాతిపితను అవమానం పరచడంపై విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఇప్పటికైనా జాతిపిత చిత్రపటానికి సరైన స్థానంలో పెట్టి గౌరవించాలని పలువురు కోరుకుంటున్నారు.

## వ్యక్తిగత పరిశుభ్రతే ప్రాథమిక చికిత్స



**నవాబుపేట్ మేజర్ న్యూస్:** మనిషి ప్రాణాలను కాపాడటానికి ప్రాథమిక చికిత్స ఎంత అవసరమో,మనిషి వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే వ్యక్తిగత పరిశుభ్రత కూడా అంతే అవసరమని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్.శ్రావణ్ కుమార్ పేర్కొన్నారు.మంగళవారం మండల పరిధిలోని యన్మన్ గండ్ల ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతి గృహంలో మెడికల్ క్యాంపు నిర్వహించిన సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ వర్షాకాలంలో కలుషితమైన నీటి వలన వ్యాపించే అతిసార, కలరా, రక్తవిరోచనాలు, పోలియో ,టైఫాయిడ్,దోమ కాటు వల్ల సంభవించే మలేరియా ఫైలేరియా డెంగ్యూ చికెన్ గున్యా, మెదడువాపు, అంటు వ్యాధుల బారిన పడకుండా ఉండడానికి కొన్ని ముందస్తు చర్యలు తీసుకోవడం ఎంతో అవసరమని,ముఖ్యంగా ప్రతి ఒక్కరు వ్యక్తిగత,పరిసరాల పరిశుభ్రతను పాటించాలని,కాచి చల్లార్చిన నీటిని తాగడం ఉత్తమమని,ఇంటి చుట్టుపక్కల నీరు నిల్వ లేకుండా చూడాలని, పరిసర ప్రాంతాలలో పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, పగిలిన కుండలు లేకుండా చూడాలని, బయట వీధుల్లో లభించే ఆహార పదార్థాల జోలికి వెళ్లకూడదని, జ్వరం, జలుబు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి, శరభలింగం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, హాస్టల్ సిబ్బంది,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగాకామ్రేడ్ సునీల్ వర్ధంతి



**గోపాలపేట మేజర్ న్యూస్ :** కామ్రేడ్ సునీల్ 14 వ వర్ధంతిని సిపిఎం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా వర్ధంతి నిర్వహించారు ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులుఎండి జబ్బర్ డి బాల్ రెడ్డి జిల్లా నాయకులు అడ్వకేట్ ఆంజనేయులు ఆయన స్తూపం దగ్గర చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా ఆయన పార్టీకి చేసిన సేవలను కొనియాడారు ప్రభుత్వ ఆసుపత్రిలో పేషంట్లకు బ్రెడ్ పండ్లు పంపిణీ చేశారు సామాజిక నాయకులు గంధం నాగరాజు నాయకులు మహేష్ రాజు అంజన్న సుధాకర్ టిఆర్ఎస్ పార్టీ నాయకులు శరత్ బాబు బాలస్వామి రాజన్న ప్రేమలీల సునీల్ తల్లిదండ్రులు ఉన్నారు.

## ఘనంగా వరల్డ్ యూత్ స్కిల్స్ డే




**కోడేరు, మేజర్ న్యూస్ :** మండల కేంద్రంలోని ప్రభుత్వ మోడల్ స్కూల్ పాఠశాలలో మంగళవారం ఘనంగా వరల్డ్ యూత్ స్కిల్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. వరల్డ్ యూత్ స్కిల్స్ డే సందర్భంగా విద్యార్థులకు పాఠశాల ప్రిన్సిపల్ రాఘవేంద్ర ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ రాఘవేంద్ర మాట్లాడుతూ విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు వితరణ చేసిన హెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజేషన్ ఫౌండేషన్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

## నేడు ఎంపీ అరుణ రాక

**మదనాపురం మేజర్ న్యూస్:** మదనాపురం మండలానికి మహబూబ్నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణరానున్నారు. మదనాపురం మండలం అజ్జకొల్లు గ్రామంలో పలు అభివృద్ధి పనులు శంకుస్థాపన చేయడానికి వచ్చేస్తున్నారు. తదనానంతరం మదనాపురం మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీలో వివిధ పార్టీల నుండి చేరికలు జరగనున్నాయి కావున మదనాపురం కొత్తకోట మండలానికి చెందిన భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు మండల స్థాయి నాయకులు అందరూ పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలనీ భారతీయ జనతా పార్టీ మదనాపురం మండల శాఖ కోరడమైనది.

## వైకుంఠ ధామం ఏర్పాటుపై తహశీల్దార్ కు వినతిపత్రం అందజేత



**కోస్గి మేజర్ న్యూస్:** కోస్గి పట్టణ శివారులో ఉన్న స్మశానవాటికలో స్థలంలో వైకుంఠధామం ఏర్పాటు చేయాలని అఖిలపక్ష నాయకులు తహశీల్దార్ కు వినతిపత్రం అందజేశారు. సోమవారంనాడు అఖిలపక్ష నాయకులు దొమ రాజేశ్వర్,బ్యాగరి రాములు,చౌడపురం శ్రీనివాస్,కుమ్మరి అంజిలయ్య, సామల వెంకట్ ప్రసాద్,గందే వెంకటయ్య,కామర్తి రామకృష్ణ,మల్లికార్జున్ తదితరులు కలిసి తహశీల్దార్ శ్రీనివాసులు వైకుంఠధామం ఏర్పాటు చర్యలు తీసుకోవాలని కోరారు. కోస్గి పట్టణం విస్తీర్ణం ప్రకారం పెద్దది కావడంతో ప్రస్తుతం ఉన్న శ్మశానవాటిక స్థలంలో కనీస అవసరాలు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.ప్రభుత్వం ఇప్పటికే పలు గ్రామలలో వైకుంఠధామంలు ఏర్పాటు చేశారని ,అదే విదంగా కోస్గి పట్టణంలో కూడా వైకుంఠధామం ఏర్పాటు చేసి స్మశానం చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

## ఘనంగా ఆషాఢ గోరింటాకు సంబురాలు..



**మఖ్తల్ మేజర్ న్యూస్ :** మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డు శబరి కాలనీలో కావలి సునీత ఆధ్వర్యంలో బతుకమ్మ అసోసియేషన్ సభ్యులు ఘనంగా ఆషాఢ గోరింటాకు సంబురాలు చేసుకున్నారు.మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని, ఒకరికొకరు గోరింటాకు పెట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆషాఢ మాసంలో గోరింటాకు విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో పద్మ, శ్రీదేవి, బి అనురాధ, గీత, పద్మజ, సంధ్య, కోలి సునీత, ఇతర మహిళలు పాల్గొన్నారు.

## దివ్యంగుల ఋణ దర ఖాస్తులకు 30 వరకు గడువు

**నారాయణపేట జిల్లా ప్రతినిధి మేజర్ న్యూస్ :** అర్హులైన దివ్యంగులకు ఆర్థిక సహాయం కింద రుణాలు అందించేందుకు ఈ నెల 30 వరకు దరఖాస్తులు చేసుకో వాలని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ ఒక ప్రకట నలోతెలిపారు.నారాయణపేట జిల్లా కు వంద శాతం రాయితీ తో 50 వేల చొప్పున 14 యూనిట్లు,80 శాతం రాయితీ తో ఇక యూనిట్ లక్ష రుణం,70 శాతం రాయి తీ టి ఒక యునిట్ 2 లక్షల రుణం,60 శాతం రాయితీ తో ఒక యూనిట్ 3లక్షల రుణం అందజేయనున్నట్లు తెలిపా రు.అర్హులైన దివ్యాంగులు 30 తేదీ లోపు దరఖాస్తు చేసుకో వాలని కోరారు.

## 108 అంబులెన్స్ లో మహిళ ప్రసవం



**మద్దూర్ మేజర్ న్యూస్:** అంబులెన్స్ లో మహిళా ప్రసవించిన ఘటన మద్దూర్ మండలం చెన్నారెడ్డిపల్లి గ్రామానికి చెందిన అనితకు మంగళవారం తెల్లవారుజామున పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 కి సమాచారం అందించారు. హుటాహుటిన అంబులెన్స్ లో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మగ బిడ్డకు జన్మనిచ్చింది. ఈఎంటి మహేష్, పైలెట్ మాణికప్ప సకాలంలో తగిన చర్యలు తీసుకొని తల్లి బిడ్డ ను క్షేమంగా నారాయణపేట జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన ఆస్పత్రి డాక్టర్లు బంధువులు సిబ్బందిని అభినందించారు.

## ఘనంగా మాజీ జెడ్పిటిసి కాశపోగు రాజు జన్మదిన వేడుకలు



**గద్వాల ప్రతినిధి మేజర్ న్యూస్:** జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మాజీ జెడ్పిటిసి కాశ పోగురాజు జన్మదిన వేడుకలు అల్లంపూర్ చౌరస్తాలోని టోల్గేట్ దగ్గర తన కార్యాలయంలో దళిత జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కాశపోగు జాన్ ఆధ్వర్యంలో కేక్ కటింగ్ సన్మాన కార్యక్రమం ఘనంగా జరపడం జరుగుతుంది ఈ సందర్భంగా కాశ పోగు జాన్ మాట్లాడుతూ ఎప్పుడు ఏ అవసరం వచ్చినా వెంటనే స్పందించే హృదయం ఉన్నవాడని అలాగే ప్రజా సమస్యలపై పోరాడేవాడని ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని ఆయుష్ ఆరోగ్యాలతో ఉండాలని భవిష్యత్తులో ఒక ఉన్నతమైన పదవిలో ఉండాలని మనస్ఫూర్తిగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు కురుమన్న ఆంజనేయులు మతిన్ మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థినిలు ఎలాంటి వేదింపులు ఎదుర్కొన్న పోలీసులను సంప్రదించాలి షీ టీమ్స్ ఇన్‌ఛార్జ్ తేజస్విని ఎస్ఐ




**గద్వాల ప్రతినిధి మేజర్ న్యూస్ :** మహిళల రక్షణ, భద్రత పరంగా ఎస్పీ టి శ్రీనివాసరావు ఐపీఎస్ ఆదేశాల మేరకు చేపడుతున్న షీ టీమ్స్ అవగాహన కార్యక్రమం రామాపురం గ్రామంలోని జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాలలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో షీ టీమ్స్ ఇన్‌ఛార్జ్ తేజస్విని ఎస్ఐ మరియు షీ టీమ్స్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులతో మాట్లాడుతూ తేజస్విని ఎస్ఐ ఇలా అన్నారు. విద్యార్థినిలు ఎలాంటి వేదింపులు ఎదుర్కొన్న నిస్సంకోచంగా పోలీసులను సంప్రదించాలి షీ టీమ్స్ హెల్ప్ లైన్ నెంబర్: 8712670312, డయల్ 100, మరియు వాట్సాప్ వ్యాప్ ద్వారా ఫిర్యాదుల నమోదు విధానం గురించి వివరించబడ్డాయి. ఈ కార్యక్రమంలో షీ టీమ్స్ సిబ్బంది, స్కూల్ ప్రధానోపాధ్యాయులు వి.నరసింహులు , అధ్యాపకులు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సంక్షేమమే పీఆర్టియు టీఎస్ లక్ష్యం



**ఊట్కూర్ మేజర్ న్యూస్ :** తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైనదని పీఆర్టియు టీఎస్ మండల అధ్యక్షులు కోరం గోవర్ధన్ పేర్కొన్నారు. మండల పరిధిలోని వల్లంపల్లి, పగిడిమర్రి, అమీన్ పూర్, ఓబులాపూర్, తిప్రాస్ పల్లి, నిడుగుర్తి, లక్ష్మిపల్లి, మొగ్దుమ్ పూర్, బిజ్వార్ పాఠశాలలలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రసంగించారు. ప్రాథమిక సభ్యులే పీఆర్టియు టీఎస్ బలం అని అందరూ విధిగా సభ్యత్వ కార్యక్రమంలో పాల్గొనాలని త్వరలోనే పెండింగ్ బకాయిలు, పీఆర్సీ అమలు చేసే బాధ్యత మా సంఘం తీసుకుంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల గౌరవ అధ్యక్షులు ఫజల్, ప్రధాన కార్యదర్శి కోస్గి నర్సింహా రెడ్డి, పీఆర్టియు టీఎస్ సభ్యులు సత్యపాల్, విక్టర్ పాల్, ఆంజనేయులు, ఆయా పాఠశాల ఉపాధ్యాయులు శశిధర్ రెడ్డి, జ్ఞానేశ్వరి, రాధిక, కావ్య, గీత, భ్రమరాంబ, భార్గవి, రామేశ్వర్ రెడ్డి, లక్ష్మారెడ్డి, రవికుమార్, గోపాల్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులు లెస్సన్ ప్లాన్, టీచింగ్ డైరీ తప్పనిసరి



**కృష్ణ మేజర్ న్యూస్ :** ఉపాధ్యాయులు లెస్సన్ ప్లాన్,టీచింగ్ డైరీను తప్పనిసరిగా రాయాలని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు గణేష్ సింగ్ సూచించారు. మంగళవారం మండలంలోని మురహరి దొడ్డి ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఆనంతరం 3,4 తరగతిలో బోధన తీరును ఆయన పరిశీలించి సరళ పదాలు విద్యార్థులతో బోర్డు పై రాయించి, చదివించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరగతిలో బోధన సమయంలో టీఎల్ఎం ను ఉపయోగించాలన్నారు. పాఠ్యాంశ భోధన ఆనంతరం విద్యార్థులు వర్క్ షీట్ల ను ,పూర్తి చేయించాలన్నారు. ప్రతి రోజూ విద్యార్థులు తెలుగు, ఇంగ్లీష్ లో రెండు పేరాగ్రాఫ్ లు ఇంటి దగ్గర నేర్చుకోవాలని , విద్యార్థులు రాసిన బేస్ లైన్ పేపర్లు పరిశీలించారు. అదేవిధంగా ఒక పీరియడ్ ను తప్పనిసరిగా గ్రంథాలయానికి కేటాయించాలన్నారు. ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలు మెరుగుపరిచాలన్నారు. పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజన పథకాన్ని విద్యార్థులకు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈరన్న, ఉపాధ్యాయులు యంఆర్.అజయ్ ,కుమారి ఆకాంక్ష, పాల్గొన్నారు.

## పెన్షనర్లను ఆర్థికంగా నష్టపరిచే బిల్లు ను ఉపసంహరించుకోవాలి



**పాలమూరు మేజర్ న్యూస్:** పెన్షన్లను ఆర్థికంగా నష్టపరిచే కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్థిక బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ ఆల్‌పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం జయంతి కలెక్టర్ మధుసూదన్ నాయక్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు నరసింహ, కోశాధికారి ఎన్ కిష్టయ్య మాట్లాడుతూ పెన్షనర్లకు తీవ్ర నష్టం కలిగించే దుర్మార్గమైన చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని, ఇది కేవలం కేంద్ర ప్రభుత్వ పెన్షనర్లకే అనుకుంటే పొరపాటని, ఈ చట్టాన్ని రానున్న రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లకు అమలు చేసే ప్రమాదం ఉందన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో జి రాములు, మృత్యుంజయ రాజు, ప్రసన్నకుమార్, ప్రసన్న కుమార్ శ్రీనివాస్ ఉన్నారు.

## విద్యుత్ శాఖ కమర్షియల్ డైరెక్టర్ కు ఘన సన్మానం



**పాలమూరు మేజర్ న్యూస్ :** విద్యుత్ శాఖ డైరెక్టర్ కమర్షియల్ చక్రపాణి, సీజీఎం భిక్షపతిని తెలంగాణ విద్యుత్ ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. నెల వారి సమీక్ష లో భాగంగా మంగళ వారం మహబూబ్ నగర్ విద్యుత్ భవన్ లో జరిగిన సమీక్ష కు వారు ముఖ్య అతిథిలుగా హాజరు అయ్యారు. ఈ సందర్బంగా తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రీజినల్ కార్య దర్శి గంగా ధర్ ఆధ్వర్యంలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను విద్యుత్ శాఖ డైరెక్టర్ చక్రపాణి, సీజీఎం బిక్ష పతి దృష్టి కి తీసుకొచ్చారు.వారు సానుకూలంగా స్పందించి వీలైనంత త్వర లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.కార్యక్రమం లో మహబూబ్ నగర్ కార్యదర్శి రామకృష్ణ, నాయకులు మహేష్, జమ్ములు, సత్యం, నరసింహ, వివిధ ఉద్యోగులు పాల్గొన్నారు.

## గోకారం రిజర్వాయర్ నిర్మాణం పనులను చేపట్టాలి

### గోకారం రిజర్వాయర్ ఎడారిగా మారింది

### బీజేపీ మండల నాయకులు చింతపల్లి కిరణ్ గౌడ్

**చారకొండ :** మండలంలో ని గోకారం రిజర్వాయర్ నిర్మాణం పనులను త్వరగా చేపట్టి పూర్తి చేయాలని బీజేపీ మండల నాయకులు చింతపల్లి కిరణ్ గౌడ్ అన్నారు. ఆయన విలేకరుల సమావేశం లో మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం రిజర్వాయరును నిర్మిస్తామని చెరువును ధ్వంసం చేసి రిజర్వాయర్ ను నిర్మించకుండా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. గోకారం చెరువు ఎడారి మయంగా అయిందని అన్నారు. ఈ ప్రాంతం రైతులు వర్షాధారం పైన ఆధారపడి వ్యవసాయం చేయడం వల్ల రైతాంగం తీవ్రంగా నష్టపోతుందని అన్నారు. కరువు వలసలు ఉన్న మా ప్రాంతం పైన ప్రభుత్వం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి ప్రాజెక్ట్ పనులను త్వరగా పూర్తిచేసి సాగునీటిని అందించాలని కోరడం జరిగింది. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కన్నా, శ్రీకాంత్ గౌడ్, వెంకటయ్య ,పవన్ గౌడ్ ,శివ పాల్గొన్నారు.

# ఈ నెల 31 వరకు ఆపరేషన్ : అదనపు కలెక్టర్ సంచిత్




**నారాయణపేట జిల్లా ప్రతినిధి మేజర్ న్యూస్ :** జిల్లాలోఈ నెల 31 వరకు ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంలో భాగంగా బాల కార్మికులను గుర్తించేం దుకు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని రెస్క్యూ టీమ్ అధికారులను జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ ఆదేశించారు. మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ఆపరేషన్ ముస్కాన్ పై ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు వయస్సు గల బాల కార్మికులు పని చేసే ప్రాంతాల్లో వారిని గుర్తించి తీసుకున్న పునరావాస చర్యలపై అధికారులకు జిల్లా కలెక్టర్ పలు సూచనలు చేశారు. జిల్లాలోని 38 కేసులు నమోదు కాదా వాటిలో 12 మేజర్, 3 ఎఫ్ఐఆర్ అయినవని, ఐదు పెండింగ్ లో ఉన్నాయని అధికారులు తెలిపారు. ఆరు మంది విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించినట్లు తెలిపారు. కోస్గి, మక్తల్ మండలాలలో దాడులు చేసిన వారు తెలిపారు. అధికారులు ఎఫ్ఐఆర్ పెంచి టార్గెట్ పూర్తి చేయాలన్నారు. ముఖ్యంగా జిల్లాలోని హొటళ్ళు, పూల దుకాణాలు, మెకానిక్ షాపులు, నిర్మాణ రంగం, భిక్షాటన, ఇటుక బట్టీలు, ఇతర చోట్ల, ప్రమాదకర ప్రాంతాలలో పని చేసే అవకాశం ఉన్న ప్రాంతాల్లో బాల కార్మికులను గుర్తించేందుకు మహిళా, శిశు సంక్షేమ శాఖ, బాలల సంరక్షణ అధికారి సమన్వయంతో కలిసి రెస్క్యూ టీమ్ అధికారులు తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ తనిఖీలలో బాల కార్మికులను గుర్తిస్తే వారిని పనిలో నియమించిన వారి పై బాల కార్మిక నిర్మూలన చట్టం 2016 ప్రకారం చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని, బాల కార్మికుల పిల్లలను బాలల సంరక్షణ కమిటీ కి అప్పగించి వారి సంక్షేమం కు చర్యలు తీసుకోవాలని సూచించారు. బాలలు పాఠశాల, కళాశాల లో ఉండాలని, పనిలో ఉండవద్దని కలెక్టర్ స్పష్టం చేశారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో, పట్టణ ప్రాంతాల్లో 0 నుండి 14 సంవత్సరాల లోపు, 14 నుండి 18 సంవత్సరాల లోపు బాలలను పని లో పెట్టుకున్నా, వారిని లైంగికంగా వేధించిన అటు వంటి సంఘటనలు బాలల సంరక్షణ అధికారి కి గాని చైల్డ్ లైన్ టోల్ ఫ్రీ నంబర్ 1098 కి సమాచారం అందించాలని అన్నారు. జులై 1 నుండి జులై 31 వరకు వివిధ శాఖల సమన్వయంతో ఆపరేషన్ ముస్కాన్ లో తప్పి పోయిన, నిరాదరణ కు గురైన, పని లో ఉన్న బాల కార్మికులను గుర్తించాలని అన్నారు. గుర్తించిన బాల కార్మికుల సంరక్షణ, వారికి విద్య అందించాలని, క్రమం తప్పకుండా హెల్త్ చెకప్ చేయించాలని జిల్లా అదనపు కలెక్టర్ అన్నారు. ఈ సమావేశం లో డిఎస్పి లింగయ్య సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కేటి దొడ్డి కేజీబీవీ ఎస్ఓ పద్మావతిని తక్షణమే సస్పెండ్ చేయాలి

**- జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణకి ఫిర్యాదు**



**గద్వాల ప్రతినిధి మేజర్ న్యూస్:** కేటీ దొడ్డి కేజీబీవీ లో జరిగిన సంఘటన దురదృష్టకరం ఆ అమ్మాయి బిల్డింగ్ మీద నుంచి దూకి ఆత్మహత్య చేసుకోవడానికి కారణమైన ఎస్ఓ మీద సమగ్ర దర్యాప్తు చేసి సస్పెండ్ చెయాలి. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని కేజీవీబీలలో ఎస్వోలు ముడుపులు తీసుకొని వాళ్లకు కావాల్సిన వాళ్లకు సీట్లు అమ్ముకుంటున్నారు. లోకల్ వాళ్ళు ఎవరడిగినా సీట్లు లేవని చేతులెత్తేస్తున్నారు. మరి వేరే జిల్లా వాళ్లకు ఎట్లా సీట్లు ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. కేటీ దొడ్డి కేజీబీవీ లో జరిగిన సంఘటన దురదృష్టకరం దీనికి అంతటి కారణం ఆ కేజీబీవీ ఎస్ఓ. ఆమె విద్యార్థులను సరిగా పట్టించుకోకపోవడం వల్లనే ఈ సంఘటన జరిగింది. కేజీబీవీ లలో చాలా అవకతవకలు జరుగుతున్నాయి. వాటిని బయటకు రాకుండా అక్కడ ఉన్నటువంటి ఎస్వోలు మేనేజ్ చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారు. జరిగిన సంఘటనలో ఆ అమ్మాయికి స్పైనల్ కార్డ్ దెబ్బతినిందని ఆర్థోపెటిక్ డాక్టర్ నాగేశ్వరరావు తెలిపిన వెంటనే హైదరాబాద్కు రిఫర్ చేయడం వల్ల ఆమెను హైదరాబాదుకు హుటాహుటిన తరలించారు. ఆమె వైద్యమునకు అవసరమయ్యే ఖర్చులన్నీ కూడా ప్రభుత్వంమే భరించి ఆమెకు మెరుగైన వైద్యాన్ని అందించాలని విద్యార్థుల సంఘాలు డిమాండ్ చేశారు. వెంటనే ఆమె మెరుగైన వైద్యం కోసం సీఎం రిలీఫ్ ఫండ్ కింద ఐదు లక్షలు ఆర్థిక సహాయం చేయాలని బీఆర్ఎస్వి రాష్ట్ర నాయకులు కురువ పల్లయ్య డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు బీఆర్ఎస్వి జోగులాంబ గద్వాల జిల్లా కోఆర్డినేటర్ కురువ పల్లయ్య, పి డి ఎస్ యు జిల్లా అధ్యక్షుడు హలీమ్ పాషా, పి వై ఎల్ జిల్లా అధ్యక్షులు దానయ్య, యుఎస్ఎఫ్ఐ రంగస్వామి ఉన్నారు.

## మాదకద్రవ్యాలతో విలువైన జీవితాన్ని చిత్తు చేసుకోవద్దు..

**- మోజర్ల మద్దిగట్ల జిల్లా పరిషత్‌లో మాదక ద్రవ్యాలు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించిన హార్టికల్చర్ విద్యార్థులు**



**పెద్దమందడి మేజర్ న్యూస్ :** నేటి సమాజం యువత మత్తు పదార్థాలతో సైబర్ నేరాలతో జీవితాలను చిత్తు చేసుకోవద్దని యువత లక్ష్యసాధన తో ముందుకు సాగుతేనే దేశం ప్రపంచంతో పోటీపడి అన్ని రంగాల్లో విజయం సాధిస్తామని మోజర్ల ఉద్యానవన కళాశాల విద్యార్థులు మోజర్ల మద్దిగట్ల జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు సూచించారు. పెద్దమందడి మండలం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మద్దిగట్ల- మోజర్లనందు మంగళవారం మోజర్ల ఉద్యాన కళాశాల యన్.ఎస్.ఎస్ (యూనిట్ -1) తొమ్మిదవ తరగతి మరియు యూనిట్-2 పదవ తరగతి విద్యార్థులకు మాదక ద్రవ్యాలు సేవించుట ద్వారా మరియు సైబర్ నేరాల కలిగే నష్టాలు వాటి నివారణ చర్యల గురించి ఉద్యాన కళాశాల విద్యార్థులు మరియు యన్.యస్.యస్ ఆఫీసర్లు డా.జి. విద్య, కె. భాస్కర్ వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో, డి.యం.హెచ్.ఓ శ్రీనివాసులు, వనపర్తి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.వరప్రసాదరావు, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు అహ్మద్, రాజు, సామాజిక కార్యకర్త శ్రీ లక్ష్మీ, మోజర్ల మాజీ సర్పంచ్ గట్టు మన్యం మద్దిగట్ల మాజీ ఎంపిటిసి లు, రామ్ చంద్రయ్య గౌడ్, చాపల సత్యారెడ్డి, బుచ్చిలింగం పాల్గొన్నారు.

## యాదవుల హక్కుల కోసం పోరాడుదాం



**కోస్గి మేజర్ న్యూస్:** తెలంగాణలోని యాదవుల హక్కుల కోసం పోరాటం చేయాల్సిన అవసరం ఉందని యాదవ సంఘం జాతీయ అధ్యక్షుడు ధర్మపురి మేకల రాములు యాదవ్,రాష్ట్ర సంఘం అధ్యక్షుడు దేవేందర్ యాదవులు అన్నారు.మంగళవారం కోస్గిలో జిల్లా సంఘం అధ్యక్షుడు హనుమంతు యాదవ్ నివాసంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో 20 శాతం ఉన్న యాదవులకు మంత్రి పదవిలో స్థానం కల్పించాలి, అదేవిధంగా నాలుగు ఎమ్మెల్సీలు, నాలుగు నామినేట్ పదవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనీ పక్షంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ దగ్గర నిరాహార దీక్ష చేపడతామని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో యాదవ సంఘం రాష్ట్ర నాయకులు బొప్పాలి వెంకటేష్ యాదవ్,పిరంపల్లి శ్రీనివాస్ యాదవ్, కడారి రాములు యాదవ్ ,సింహ యాదవ్, శ్రీశైలం యాదవ్,గుడిగే శ్రీనివాస్ యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేష్, వర్క్ ప్రెసిడెంట్ గంటల రమేష్, యూత్ అధ్యక్షులు యాదవ సంఘం తాలూకా అధ్యక్షుడు జింకల శ్రీనివాస్, కోస్గి మండల అధ్యక్షుడు మోహన్, గుండుమల్ మండలం అధ్యక్షులు కరణం వెంకట్ రాములు,కొత్తపల్లి మండల్ అధ్యక్షులు అంజి, మేకలు రాములు యాదవ్, చేతుల మీద తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి అల్లి రాజు యాదవ్, తెలంగాణ రాష్ట్ర ప్రచార కార్యదర్శి పెద్ద వెంకటయ్య, నారాయణపేట జిల్లా కార్యదర్శి అంజి యాదవు, వెంకటయ్య, కేశవులు, కృష్ణయ్య యాదవ్, నవీన్, మహేష్, శ్రీను, రాములు పాల్గొన్నారు.

## వైద్యులపై దాడులను అరికట్టాలని ఎస్పీకి వినతి



**పాలమూరు మేజర్ న్యూస్ :** జిల్లా కేంద్రంలోని యునైటెడ్ ఆసుపత్రి డాక్టర్, ఐఎంఏ ప్రెసిడెంట్ జె.రామ్మోహన్ పై దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, వైద్యులపై జరిగే దాడులను అరికట్టాలని, వైద్యులకు రక్షణ కల్పించాలని కోరుతూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఎస్పీ.డీ.జానకిని కలిసి వినతిపత్రం అందజేశారు. వైద్య చికిత్సలు అందించి ప్రజల ప్రాణాలు కాపాడే వైద్యులపై దాడి చేయడం సరైనది కాదని రోజురోజుకు వైద్యులపై దాడులు పెరిగిపోతున్నాయని, వైద్యులపై దాడులు పునరావృతం కాకుండా చూడాలని కోరారు వినతిపత్రం ఇచ్చిన వారిలో ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ రామ్మోహన్, కార్యదర్శి సంపత్ కుమార్,కోశాధికారి డాక్టర్ ఎం. రాఘవేంద్ర కుమార్, విజయరామరాజు శ్రీనివాసరెడ్డి, విజయ్ కాంత్, ప్రతిభ, స్వప్న, సౌమ్య, అపర్ణ,రజినీకాంత్ పాల్గొన్నారు.

## దేశంలో కమ్యూనిస్టుల పోరాటం చరిత్రలో చెరుపలేరు: సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కే కేశవులు గౌడ్




**తెలకపల్లి మేజర్ న్యూస్ :** ఆగస్టు 1, 2 తేది లో కల్వకుర్తి పట్టణంలో సిపిఐ జిల్లా 3వ మహా సభలు జయప్రదం చేయాలి మంగళవారం మండల కేంద్రంలో మండల పార్టీ సహాయ కార్యదర్శి యం.నరేందర్ రెడ్డి అద్యక్షతన జరిగింది ఈసమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కేశవులు గౌడ్ మాట్లాడుతూ బుడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ఏకైక పార్టీ సిపిఐ పార్టీ అని భారత స్వాతంత్ర్య సమరం నుండి మొదలు కొని నేటి వరకు పేదల సంక్షేమం కోసం వారి పక్షాన నిలబడి పోరుబాట నడిపిస్తున్న పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా మహా సభలు ఆగస్టు 1, 2,తేది లో కల్వకుర్తి పట్టణంలో సిపిఐ జిల్లా 3వ మహా సభలు నిర్వహించడం జరుగుతుందని ఈ మహా సభలకు శాసనసభ్యులు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనమనేని సాంబశివరావు. పార్టీ జాతీయ సమితి సభ్యులు చాడా వెంకట్ రెడ్డి. పల్లా వెంకట్ రెడ్డి. రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బాల నరసింహ.తదితరముఖ్యనాయకులు పాల్గొంటారని ఆయన తెలిపారు ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి సూర్య శంకర్ గౌడ్.సిపిఐ జిల్లా సమితి సభ్యులు డి బాలమురలీకృష్ణ మండల కార్యదర్శి వేనేపల్లి రవీందర్ ఏఐవైఫ్ జిల్లా అధ్యక్షుడు డి ఆంజనేయులు. విష్ణు. సీతయ్య. బుగ్గ స్వామి. బిచ్చయ్య.%వీణ% నిరంజన్ వినోద్ తదితరు పాల్గొన్నారు.

## బిసి రిజర్వేషన్ లు అమలుకై చలో హైదరాబాద్ బయలుదేరిన బిఆర్ఎస్ నాయకులు



**కొత్తకోట రూరల్ మేజర్ న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం కామారెడ్డి బి.సి. డిక్లరేషన్ ను చిత్తశుద్ధితో అమలు చేయాలి. ఆర్డినెన్సు తీయడం కాంగ్రెస్ చేస్తున్న మోసం వెంటనే అఖిల పక్షాన్ని డిల్లీకి తీసుకెళ్ళి రాజ్యాంగ సవరణ చేయాలి. ఈ బిల్లుపై సవాల్ చేయడానికి వీలులేకుండా తొమ్మిదవ షెడ్యూల్ లో చేర్చాలి. స్థానిక సంస్థలలో 42% బీ సీ రిజర్వేషన్ల చట్టబద్ధత కల్పించి ఎన్నికలు నిర్వహించాలని,విద్య, ఉద్యోగాలలో బీసీ లకు 42% రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్ ధర్నా చౌక్ లో బి సి ప్రతినిధుల ఫెడరేషన్ బిసిపిఎఫ్ ఆద్వర్యంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో పాల్గొని మద్దతు తెలిపిన దేవరకద్ర నియోజకవర్గ కొత్తకోట మదనాపురం మండలాల బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం ఎస్సై వెంకటేశ్వర్లు గౌడ్



**లింగాల, మేజర్ న్యూస్:** నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని ఎస్సై వెంకటేశ్వర్లు గౌడ్ అన్నారు. మంగళవారం రాయవరం గ్రామంలో సీసీ కెమెరాలు ప్రాముఖ్యత-ఆవశ్యకతపై అవగాహన సదస్సు నిర్వహించారు. . గ్రామాలలో సీసీ కెమెరాలు ఏర్పాటుకు స్థానికులు ముందుకు రావాలని, కెమెరాలు ఏర్పాటుకు సహకరించిన దాతలకు అభినందించారు. ఈ కార్యక్రమంలో రాయవరం మాజీ సర్పంచ్ మల్లయ్య, ఏకలవ్య గ్లోబల్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉల్లం గొండ్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

## సినారె సాహిత్య పురస్కారానికి 'కోట్ల' ఎంపిక



**పాలమూరు మేజర్ న్యూస్:** విశ్వంభర రచయిత, జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత, సినీ గేయ రచయిత డాక్టర్ సి.నారాయణరెడ్డి 94 వ జయంతి సందర్భంగా ప్రధానం చేయనున్న'సాహిత్య పురస్కారం' కు, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన, కాళోజీ అవార్డు గ్రహీత, సాహిత్య దిగ్గజం, ప్రముఖ కవి 'కోట్ల వెంకటేశ్వరరెడ్డి' ఎంపిక కావడం పట్ల సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు జగపతిరావు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తంచేశారు. ఈ నెల 27 న యాదాద్రి భువనగిరి జిల్లా రచయితల సంఘం, జిల్లాలోని సాహిత్య సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో భువనగిరిలో జరుగనున్న 'సినారె' జయంతీ ఉత్సవాలలో ఈ అవార్డును ప్రధానం చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని ప్రముఖ కవులు, సాహితీవేత్తలు, విశ్రాంత ఉద్యోగులు కోట్ల వెంకటేశ్వరరెడ్డి ని అభినందించారు.

## పాఠశాలను తనిఖీ చేసిన రెవెన్యూ అదనపు కలెక్టర్



**మహబూబ్ నగర్, మేజర్ న్యూస్:** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ మంగళవారం తనిఖీ చేశారు. విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.పదవ తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థిని, విద్యార్థులతో మాట్లాడి బోధన,మౌలిక వసతులు గురించి తెలుసుకుని బాగా చదువుకోవాలని విద్యార్థినులకు దిశా నిర్దేశం చేశారు.

## ప్రభుత్వ గిరిజన బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేసిన రెవెన్యూ అదనపు కలెక్టర్

**మహబూబ్ నగర్, మేజర్ న్యూస్ :** జిల్లా కేంద్రంలో బోయపల్లి రోడ్ లో నున్న ప్రభుత్వ గిరిజన బాలుర వసతి గృహన్ని మంగళవారం రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆకస్మిక తనిఖీ చేశారు. వసతి గృహ విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు తమ గదులకు కిటికీలకు దోమ తెరలు లేవని, త్రాగుటకు మినరల్ వాటర్ లేవని తెలిపినారు. విద్యార్థులకు మినరల్ వాటర్ ఇవ్వాలని, మెనూ ప్రకారం భోజనము అందించాలని వసతి గృహ సంక్షేమ అధికారిని ఆదేశించారు. దోమల నివారణకు 10 ఆల్ అవుట్ తక్షణం రెవెన్యూ అదనపు కలెక్టర్ కొని అంద చేశారు. వసతి గృహమునకు కావలసిన మరమ్మతులు, ఆర్ ఓ ప్లాంటు ఏర్పాటుకు తగు చర్యలు తీసుకోవాలని, మంజూరు కోరకు ప్రతిపాదనలను కమిషనర్, గిరిజన సంక్షేమ శాఖ గారికి పంపుటకుజిల్లా గిరిజన అభివృద్ధి అధికారికి సూచించారు.

## కలెక్టర్ కార్యాలయం పరిశుభ్రంగా ఉండాలి - రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్



**మహబూబ్ నగర్, మేజర్ న్యూస్:** జిల్లా కలెక్టర్ కార్యాలయం ఆవరణ పరిశుభ్రత గా ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ తెలిపారు.మంగళవారం కలెక్టర్ కార్యాలయం ఆవరణలో ని ఈ.వి.ఎం.గోదాం,హెలిపాడ్ వద్ద చెత్త, పిచ్చి మొక్కలు క్లీన్ చేయడం ఆయన పర్యవేక్షించారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ముగ్గు వేసి పనులు ప్రారంభించిన కాంగ్రెస్ నాయకులు



**ఉట్కూరు మేజర్ న్యూస్ :** ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులందరూ నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించాలని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కొక్కు లింగం అన్నారు మండల కేంద్రంలోని పాతపేట, ఎల్బీనగర్ వీధుల్లో మంగళవారం ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణ పనులు ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ప్రభుత్వం పేద ప్రజలను గుర్తించి ఇండ్లు మంజూరు చేసిందని మొదటి విడతలో ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు త్వరగా పూర్తి చేయాలన్నారు.గ్రామాల అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్నామని అన్నారు దానికి గ్రామ ప్రజలు కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో యూత్ మండల అధ్యక్షులు కోరం మహేష్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ కే గోవిందప్ప, యజ్ఞ దత్తు, రఘు గౌడ్, గ్రామపంచాయతీ సిబ్బంది పోలప్ప, కనకప్ప కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మొబైల్ షాపులో చోరీ

**గోపాలపేట మేజర్ న్యూస్ :** మండల కేంద్రంలోని బస్టాండ్ దగ్గర ఉన్న శ్రీ లక్ష్మీ మొబైల్ షాపులో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారని ఎస్సై నరేష్ కుమార్ తెలిపారు వివరాలు ఇలా ఉన్నాయి బస్టాండ్ దగ్గర ఉన్న మొబైల్ షాప్ యజమాని శివకుమార్ రోజు మాదిరి రాత్రి 8 గంటల సమయంలో తన షాపుకు తాళం వేసి ఇంటికి వెళ్ళిపోయారు మంగళవారం ఉదయం ఐదు గంటల ప్రాంతంలో రాహుల్ అనే యువకుడు ఫోన్ చేసి నీ యొక్క షాపు షట్టర్ పగలగొట్టుకొని తెలుసుకొని ఉన్నదని చెప్పగా వెంటనే బాధితుడు శివ తన షాపుకు వెళ్లి చూడగానే షాపు పగలగొట్టి ఉన్నదని పోలీస్ స్టేషన్లోఫిర్యాదు చేయగా వెంటనే సంఘటన స్థలానికి సిబ్బందితోపాటు డాగ్ స్క్వాడ్స్ తీసుకొచ్చి పరిశీలించామని నాలుగు పాత ఫోన్లు చార్జర్లు తీసుకొని వెళ్ళినట్లు బాధితుడు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు ఈ విషయంపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## కోటకదిరలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ గ్రామ కమిటీ ఎన్నిక



**పాలమూరు మేజర్ న్యూస్:** మహబూబ్ నగర్ రూరల్ మండలం కోటకదిర గ్రామ తెలంగాణ ముదిరాజ్ మహాసభ గ్రామకమిటీని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు బండా ప్రకాష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెద్ద విజయ్ కుమార్ ఆదేశాల మేరకు కోటకదిర గ్రామ కమిటీని జిల్లా అధ్యక్షుడు మెట్టుకాడి ప్రభాకర్ మరియు తెలంగాణ ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడు తుపాకుల చంద్రుడు ఆధ్వర్యంలో గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అధ్యక్షులుగా వాకిటి యాదయ్య, ఉపాధ్యక్షులుగా కంపిలి రాంకొండ, కాటికె సురేష్ లాలు, ప్రధాన కార్యదర్శిగా కాటికె రాజశేఖర్ , కోశాధికారిగా చాపల రమేష్ , కార్యదర్శులుగా తెలుగు శ్రీకాంత్, , సహాయ కార్యదర్శులుగా బజ్జిల కృష్ణంరాజు, తాటి శేఖర్, కార్యవర్గ సభ్యులుగా వాకిటి రాజు, వాకిటి శేఖర్, మంతన్గోడ్ శీను, తెలుగు నాగేశ్, వాకిటి మల్లేశ్, తెలుగు రాములు, కంపిలి శేఖర్, వాకిటి శేఖర్ లను ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు మెట్టుకాడి ప్రభాకర్ గారు మాట్లాడుతూ ముదిరాజులందరూ జాతి ఐక్యతకోసం కృషిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ముదిరాజులకు రావాల్సిన న్యాయమైన సబ్సిడి ఋణాలపై అందరూ అవగహన కలిగి ఉండి ఆర్థికంగా ఎదగాలన్నారు. ఆర్థికంగా బలపడినప్పుడే రాజకీయంగా ఎదగడానికి ముదిరాజులకు అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో ముదిరాజులు గ్రామస్థాయిలో చైతన్యమై సర్పంచి, ఎంపిటిసి, జడ్పిటిసి స్థానాల్లో పోటీ చేసి గెలుపొందాలన్నారు.కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా ప్రచార కార్యదర్శి బోల యాదయ్య, తెలంగాణ ముదిరాజ్ మహాసభ మండల ప్రచార కార్యదర్శి కోదూరు వెంకట్ రాములు, మండల నాయకులు కుర్మయ్య పాల్గొన్నారు.

## జాతీయ నేత రాహుల్ గాంధీ, ఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేసిన కాంగ్రెస్ నాయకులు



**మదనాపురం మేజర్ న్యూస్:** మదనాపురం మండలం నెలివిడి గ్రామము లో బి సి రిజర్వేషన్ 42% రాష్ట్ర ప్రభుత్వం చట్ట బద్దత కల్పించినందున కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులు రాహుల్ గాంధీ ,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి , చిత్ర పటాలకు పాలభిషేకం చేసిన కాంగ్రెస్ నాయకులు ఈ కార్యక్రమం లో పాల్గొన్న మండలనాయకులు వర్కింగ్ ప్రసిడెంట్ వడ్డె కృష్ణ మాజీ యం పి పి మహదేవన్ గౌడ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మైనార్టీ కార్యదర్శి అంజాద్ అలీ గ్రామ పరిశీలకులు మాజీ సర్పంచ్ వాకిటి సత్యం, రాములు, మాజీ యం పి టి సి కుర్మన్న మార్కెట్ డైరక్టర్ విజయ్ మాజీ సర్పంచ్ కొండన్న గ్రామ పార్టీ అధ్యక్షులు బేరి కొండన్న నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ యువజన ప్రధానకార్యదర్శి రమేష్ యాదవ్ ,మాజీ ఉపసర్పంచ్ శ్రీను, స్వామి గౌడ్ ,మారుతి వెంకటేష్ యాదవ్ పరుశరామ్ నర్సిహ్మ గౌడ్ తాతయ్య నాగరాజు,నర్సింగాపూర్ కొండన్న శ్రీను లంబాడి వెంకటేష్ నాయక్ ,తిరుపతి, బద్రి ,వెంకటయ్య ,బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## కస్తూర్బా వసతి గృహాల్లో అధికార పార్టీ నాయకుల పెత్తనం ఏంటి

### బీఎస్పీ నారాయణ పేట జిల్లా అధ్యక్షులు బొదిగెలి శ్రీనివాస్



**మరికల్ మేజర్ న్యూస్:** అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో పని చేస్తూ,పేద విద్యార్థుల నోట్లో మట్టి కొడుతున్న మరికల్ కస్తూర్బా ప్రిన్సిపల్ పై తక్షణమే విచారణ జరిపించాలని బీఎస్పీ నారాయణ పేట జిల్లా అధ్యక్షులు బొదిగెలి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం మరికల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులు చదువుకునే కస్తూర్బా వసతి గృహాల్లో అధికార పార్టీ నాయకుల పెత్తనమేంటని ప్రశ్నించారు.పేద విద్యార్థులకు కేటాయించాల్సిన సీట్లను అధికార పార్టీ నాయకులతో కుమ్మక్కై వారి సిఫారసులతో సీట్లు కేటాయించమేంటని ఆరోపించారు.కనీసం విద్యార్థుల తల్లిదండ్రులకు లోపలికి అనుమతించకుండా కేవలం రాజకీయ నాయకులను అనుమతిస్తుండడంతో విద్యార్థుల తల్లిదండ్రులను తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారని ఆరోపించారు. తక్షణమే కస్తూర్బా ప్రిన్సిపల్ పై,సీట్ల అవకతవకలపై విచారణ జరిపించి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

## పరిశ్రమలు స్థాపించి దేవరకద్రను ప్రపంచ పటంలో నిలుపుతాం

### - దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి



**అడ్డాకుల, మేజర్ న్యూస్:** నియోజకవర్గంలో నిరుద్యోగులకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించడానికి ప్రతిష్టాత్మకంగా పెద్ద ఎత్తున పరిశ్రమలను స్థాపించి దేవర్‌కద్రను ప్రపంచపటంలో నిలుపుతామని ఎంఎల్ఏ జి.మధుసూదన్ రెడ్డి అన్నారు. మంగళవారం అడ్డాకుల మండల పరిధిలోని గుడిబండ లోని 118 సర్వే నెంబర్ లో గల 100 ఎకరాల ప్రభుత్వభూమిలో డ్రైపోర్టు నిర్మాణానికి తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ( టి.ఎస్.ఐ. ఐ.సీ), రెవెన్యూ అధికారులతో కలిసి స్థల పరిశీలన చేసిన సందర్భంగా మాట్లాడారు. ఇటీవల దేవరకద్రలో బ్రహ్మోస్ మిస్సైల్ యూనిట్ దాని అనుబంధ సంస్థలు నిర్మించడానికి కూడా అధికారులు పరిశీలన చేసి వాటి ఏర్పాటుకు సానుకూలంగా ఉన్నారని అన్నారు. దేవరకద్రకు 44, 167 జాతీయ రహదారుల గుండా హైదరాబాద్, కర్నూల్ రాయచూర్ మీదుగా 68 కిలోమీటర్ల సరిహద్దు ఉందని తద్వారా డ్రై పోర్టు విజయవంతం కావడానికి అవకాశం ఉందని అన్నారు. ప్రాథమిక పరిశీలన తో డ్రై పోర్ట్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపడంతో సీఎం, ఇండస్ట్రియల్ శాఖ మంత్రి శ్రీధర్ స్థల పరిశీలనకు అధికారులను పంపించినందుకు ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ఫిట్ నెస్ లేని ప్రైవేట్ బస్సులు సీజ్

### - గద్వాల ఆర్టీవో వెంకటేశ్వరరావు




**గద్వాల టౌన్ మేజర్ న్యూస్:** జిల్లా పరిధిలోని ఐజ, శాంతినగర్ ప్రాంతాలకు చెందిన ప్రైవేట్ విద్యా సంస్థలకు సంబంధించిన 6 బస్సులను సీజ్ చేసినట్లు ఆర్టీవో వెంకటేశ్వరరావు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న 6బస్సులను మంగళవారం సిబ్బందితో కలిసి సీజ్ చేయడం జరిగిందన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థలకు చెందిన బస్సులు పూర్తిగా ఫిట్ నెస్ కలిగి ఉండాలన్నారు. అనుభవజ్ఞులైన డ్రైవర్లును బస్సులు నడిపేందుకు నియమించుకోవాలని విద్యాసంస్థల అధినేతలను హెచ్చరించారు.

## తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాలు

### - ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



**మహబూబ్‌నగర్, మేజర్‌న్యూస్:** తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాలు పండుగ అని స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పట్టణం లోని గణేష్ నగర్ లో మంగళవారం జరిగిన కట్ట పోచమ్మ బోనాల పండుగ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై పోచమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు గోపాల్ యాదవ్, ఖాజా పాషా, రషెద్ ఖాన్, శాంతన్న యాదవ్, ప్రశాంత్, నాయకులు డీలర్ రఘు, లీడర్ రఘు, చిన్న, రమేష్, చందు, సత్తి, వెంకటేష్, చెన్నయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## బిసి మహాధర్నకు వెళ్లిన టిఆర్ఎస్ నాయకులు



**గోపాలపేట మేజర్ న్యూస్ :** హైదరాబాద్ లోని ఇందిరాపార్క్ వద్ద బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కు చట్టబద్ధత కల్పించాలని చేపడుతున్న మహాధర్నాకు గోపాలపేట టిఆర్ఎస్ నాయకులు తరలి వెళ్లారు మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆదేశాల మేరకు తరలి వెళ్ళినట్టు తెలిపారు.

# పులి సంచారంతో.. అధికార యంత్రాంగం అప్రమత్తం

## - అధికారులతో కలిసి గుర్రం గట్టును సందర్శించిన కలెక్టర్, ఎస్పీ



**మహబూబ్ నగర్, మేజర్ న్యూస్:** మహబూబ్ నగర్ పట్టణంలో, వీరన్నపేట, గుర్రంగట్టు ప్రాంతం వద్ద చిరుత సంచారం చేస్తున్న నేపథ్యం లో జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉంటూ నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు.మంగళవారం జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్.పి.డి.జానకి, అటవీ, పోలీస్, మున్సిపల్ అధికారులతో కలిసి గుర్రం గట్టు గుట్ట ప్రాంతం సందర్శించి గుట్టపై కాలి నడకన ఎక్కి గుర్రంగట్టు ప్రాంతం వద్ద చిరుతపులి సంచరించిన ప్రాంతం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అటవీ, పోలీస్, మున్సిపల్ శాఖల నుండి టీమ్‌లు ఏర్పాటు చేసి 24%ఇ%7 పర్యవేక్షణ చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ పులి సంచారం విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు వెంటనే స్పందించి పులి తిరిగే ప్రదేశంలో బోను అమర్చినట్లు తెలిపారు.. ప్రజలను అవగాహన కల్పించి అప్రమత్తులను చేసినట్లు తెలిపారు. సి.సి. కెమెరాలతో పాటు, డ్రోన్ కెమెరాల ద్వారా కూడా పర్యవేక్షణ చేస్తున్నట్లు, ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రజలు ఎటువంటి భయాందోళన చెందకుండా అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కలిగించినట్లు తెలిపారు. గ్రామస్థులు తమ భద్రత కోసం క్రింది జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు. ఒంటరిగా ఎక్కడికైనా వెళ్లవద్దు, ముఖ్యంగా తెల్లవారు జాము మరియు రాత్రి సమయంలో పిల్లలను ఒంటరిగా బయటకు పంపవద్దు %-% పశువుల మేత కోసం వెళ్లడం, ఆటలు ఆడడం వంటివి చేయకండి. ఎండుకట్టెల కోసం అడవిలోకి వెళ్లవద్దు. అటవీ ప్రాంతంలో మద్యం సేవించడాన్ని పూర్తిగా నివారించండి. పశువులను బలమైన కంచెలతో కూడిన షెడ్‌లలో రాత్రివేళ ఉంచండి. అడవి ప్రాంతంలో ఆహార అవశేషాలు, పశువుల మృతదేహాలు పడవేయవద్దు %-% ఇవి చిరుతలను ఆకర్షించవచ్చు. చిరుతను చూసినప్పుడు పరుగెత్తవద్దు. చిరుత ఎదురైతే %-% భయపడకుండా, చేతులు పైకి ఎత్తి, నెమ్మదిగా వెనక్కి అడుగులు వేయాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ సెల్ఫీలు, రీల్స్ తీయడం వంటివి ప్రయత్నించవద్దు. పిల్లలు మరియు వృద్ధులను ఎప్పటికప్పుడు నిశితంగా పర్యవేక్షించండి. భయం చెంది అరుస్తూ పరుగెత్తకండి %-% ఇది చిరుతను రెచ్చగొట్టవచ్చు. అడవి ప్రాంతాలకు లేదా పొలాల దిశకు వెళ్లేటప్పుడు గుంపులుగా వెళ్లండి. అరణ్య సమీప ప్రాంతాల్లో బహిరంగ మలవిసర్జన నివారించండి %-% మరుగుదొడ్లు వినియోగించండి. చిరుతను తరుమే ప్రయత్నం చేయవద్దు, ఎదుర్కొనవద్దు. ఏదైనా సమాచారం ఉంటే వెంటనే అటవీ శాఖ అధికారులకు తెలియజేయండి. జిల్లా ఎస్.పి. డి. జానకి మాట్లాడుతూ "పోలీస్ యంత్రాంగం తరఫున కూడా అన్ని చర్యలు తీసుకుంటున్నాం అని తెలిపారు. చిరుత పులి సంచార ప్రాంతాలలో పహారా బలగాలు, డ్రోన్లు, నైట్ విజన్ కెమెరాల ద్వారా గమనిస్తాం. ప్రజల భద్రత కోసం అదనపు బందోబస్తు ఏర్పాటు చేశాం అన్నారు. ఈ కార్యక్రమంలో డి.ఎస్.పి వెంకటేశ్వర్లు, జిల్లా అటవీ శాఖ అధికారి సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్ రెడ్డి,వన్ టౌన్ సి. ఐ.అప్పయ్య, తదితరులు ఉన్నారు.

## రక్తదానం మరొకరికి ప్రాణదానం

### - జిల్లా వైద్య శాఖ అధికారి డాక్టర్ శ్రీనివాసులు

### - స్వచ్ఛందంగా రక్తదానం చేసిన 52 మంది ఉద్యానవన కళాశాల విద్యార్థులు



**పెద్దమందడి మేజర్ న్యూస్ :** రక్తదానం మరొకరికి ప్రాణదానమని ప్రతి ఒక్కరు మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చునని విద్యార్థులు యువత సేవా దృక్పథాన్ని అలవర్చుకొని ముందుకు సాగాలని వనపర్తి జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ డాక్టర్ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. పెద్దమందడి మండల పరిధిలోని మోజర్ల గ్రామంలో ఉద్యాన కళాశాల, మోజెర్ల వారు నిర్వహిస్తున్న జాతీయ సేవా పథక ప్రత్యేక శిబిరం (యూనిట్- 1 %ఒ% 2) సంయుక్తంగా ఐదవ రోజులో భాగంగా యన్.యస్.యస్ ఆఫీసర్లు కె. భాస్కర్ డా.జి.విద్య అధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సహకారంతో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, వనపర్తి వారితో కలిసి మద్దిగట్ల మోజర్ల హై స్కూల్లో స్వచ్ఛంధ రక్తదాన శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించారు. హార్టికల్చర్ విద్యార్థులు, ప్రొఫెసర్స్, గ్రామ యువకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో 52 మంది ఉద్యాన విద్యార్థులు జిల్లా డి.యం.హెచ్.ఓ శ్రీనివాసులు, రెడ్ క్రాస్ సొసైటీ, వనపర్తి మెడికల్ ఆఫీసర్, డా.జ్యోతి, మేనేజింగ్ కమిటీ సభ్యులు అహ్మద్ బిన్ ఒమర్, రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ రాజేందర్, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది వహీద్, లక్ష్మీపతి, కార్తీక్, లక్ష్మీ, ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డా.పి. సైదయ్య, అసోసియేట్ ప్రొఫెసర్ షహనాజ్, సామాజిక కార్యకర్త, శ్రీలక్ష్మీ, హైస్కూల్ హెడ్ మాస్టర్, వరప్రసాద్, పి.హెచ్.సి వైద్యురాలు డా.ప్రవళిక, డా. వర్షిత, మోజర్ల పంచాయతీ కార్యదర్శి హకీమ్, మాజీ సర్పంచ్ గట్టు మన్యం, గట్టు అంజి, ఎ. రాములు మాజీ యం.పి.టి.సి. రామచంద్రయ్య, మద్దిగట్ల మాజీ యం.పి.టి.సి సత్యారెడ్డి, బుచ్చి లింగం మరియు ఇరుగ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రమాదపుటంచున కూరగాయల వ్యాపారం



**పాలమూరు మేజర్ న్యూస్:** నడిరోడ్డు మీద కూరగాయల వ్యాపారం చేస్తూ ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని నేషనల్ కంజ్యూమర్ రైట్స్ కమిషన్ రాష్ట్ర చైర్మెన్ బునేడు బాల్ రాజ్ ఆందోళన వ్యక్తంచేశారు. మంగళవారం ఆయన పట్టణంలోని పాత బస్ స్టాండ్ సమీపం నుండి తిరుమల దేవుని గేటు వరకు అర కిలోమీటరు దూరం రోడ్డుకు ఇరువైపులా కూరగాయలు అమ్ముకునే రైతులతో మాట్లాడారు. అసలే ఇరుకైన రోడ్డు, చించోలి, ముంబాయి, కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాలకు వెళ్ళేందుకు భారీ వాహనాలు, ఆర్టీసీ బస్సులు వెళుతుంటాయని, పైగా టిడి గుట్ట దగ్గర ఉన్న రైల్వే గేటు మూసి, తెరిచిన వెంబడే భారీ వాహనాల రద్దీ విపరీతంగా ఉంటుందని ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉంటుందని, కూరగాయల వ్యాపారం మరో చోటకు మార్చుకోవాలని రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేయగా వారు ససేమిరా అన్నారు. అనంతరం జిల్లా మార్కెట్ అధికారిణి బాలమణి, మహబూబ్ నగర్ కూరగాయల మార్కెట్ అధికారి కేశవులు లను కలిసి రోడ్డుపైన ప్రమాదకరంగా జరుగుతున్న కూరగాయల వ్యాపారం, ట్రాఫిక్ జాం,వారి భద్రత లపై చర్చించారు. వ్యాపారస్థులతో చర్చించి చర్యలు చేపడతామని వారు హామీ ఇచ్చినట్లు బాల్ రాజ్ తెలిపారు.

విలేకరులు కావలెను
సంచలన దినపత్రికగా పేరొందిన నేటి దినపత్రిక
సూర్య
లో పనిచేసేందుకు ఆసక్తి కలిగిన విద్యావంతులకు, విలేకరులకు
మహబూబ్‌నగర్ జిల్లా :
హన్వాడ, భూత్పూర్, మూసాపేట, కౌకుంట్ల, రాజాపూర్
ఏరియాల్లో అవకాశం కల్పిస్తోంది.
సీనియర్లకు ప్రాధాన్యత ఇవ్వబడును.
ఆసక్తి కలిగిన వారు సంప్రదించాల్సిన నెంబరు
8008622757